బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ సోమవారం 28, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

ఏడాదిలోగా హెచ్-1బీ వీసా విధానంలో భారీ మార్పులు..!



మిగతా 3లో..

సాగు గోస.. సర్కార్ తమాషా



- ప్రాజెక్టుల్లో నీళ్లున్నా ఇవ్వకుండా నిద్ర నటిస్తున్న ప్రభుత్వం
- కాంగ్రెస్ తెచ్చిన కరువుకు పాలమూరులో 40% పంట నష్టం
- ఎల్ నినోపై హెచ్చరికల్ని పెడచెవిన పెట్టిన సర్కార్
- ఏపీకి కృష్ణా నీళ్లు.. పాలమూరు రైతుకు కన్నీళ్లా?
- నీళ్లులేక పంటలెండుతుంటే రైతులు ఏడుస్తున్నరు
- ప్రత్యేకంగా సర్వేచేసి నష్టపరిహారం అందించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్
- నాగర్‌కర్నూల్ దేశీటిక్యాలలో పంటల పరిశీలన

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 27 : సాగునీరున్నా పంటలకు ఇవ్వకుండా అవి ఎండిపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి తమాషా చూస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో దాదాపు మిగతా 3లో..

నకిలీ సర్టిఫికెట్లతో ఎంబీబీఎస్ సీట్లు..



- 9 మంది విద్యార్థుల అడ్మిషన్లు రద్దు!

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 27: నీట్ అర్హత కలిగి ఉండి 2026-27 విద్యా సంవత్సరంలో విద్యాభ్యా సానికి రిజిస్టర్ చేసుకున్న విద్యార్థుల్లో 37 మంది నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లు సమర్పించినట్టు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులు పేర్కొన్నారు. వీరిలో 9 మంది అభ్యర్థులు ఇప్పటికే యూనివర్సిటీ పరిధిలోని మెడికల్ కళాశాలల్లో సీట్లు దక్కించుకున్నట్లు గుర్తించారు. నిబంధనలను అనుసరించి నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన విద్యార్థుల సీట్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించి ఆయా కళాశాలలకు సమాచారం అందిం చారు. నీట్ ర్యాంకు ఆధారంగా రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయాలని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ అధికారులను కోరిన యూనివర్సిటీకి ఆ శాఖ డైరెక్టర్ ఈ నెల 22న మిగతా 3లో..

మేము రాగానే అందరి లెక్క తేలుస్తాం

- నేడు వాన పాములు కూడా బుసలు కొడుతున్నాయి
- అన్నీ గమనిస్తున్నాం.. టైం వచ్చినప్పుడు పని పడతాం
- రేవంత్‌రెడ్డి పంచన చేరిన ప్రకాశ్‌గౌడ్‌ను విడిచిపెట్టం
- బీఆర్ఎస్‌లో చేరికల సభలో కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్, సెప్టెంబర్ 27 : అధికార బలంతో కొన్ని వానపాములు కూడా నాగుపాముల్లా బుసలు కొడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నీ గమనిస్తున్నామని, టైం వచ్చినప్పుడు అందరి లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పటోళ్ల కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మిగతా 3లో..

విద్యార్థినిపై అత్యాచారం..



- అట్టుడికిన పంజాబ్ వర్సిటీ
- ఎల్వీయూలో నిరసనకు దిగిన 2 వేల మంది విద్యార్థులు
- పలు ఆస్తులు, వాహనాల ధ్వంసం.. పరిస్థితి ఉద్రిక్తం
- సిట్ వేసిన పోలీసు ఉన్నతాధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : పంజాబ్‌లోని ఫగ్వారాలో ఉన్న లవ్‌లీ ప్రొఫెషనల్ యూని వర్సిటీ (ఎల్పీయూ) ప్రాంగణం విద్యార్థుల ఆందోళనలతో అట్టుడికింది. వర్సిటీ హాస్టల్‌లో ఓ విద్యార్థినిపై బయటి వ్యక్తి అత్యాచారం చేశా డని ఆరోపిస్తూ 2వేల మంది విద్యార్థులు ఆది వారం తెల్లవారుజామున క్యాంప్‌సలో బీభత్సం సృష్టించి.. పలు ఆస్తులను ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. అనంతరం ఢిల్లీ-అమృత్‌సర్ జాతీయ రహదారిని దిగ్బంధించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విద్యార్థుల ఆందోళనల నేప థ్యంలో అక్కడి భారీగా చేరుకున్న పోలీసులు.. వారి ఫిర్యాదు మేరకు 'గుర్తు తెలియని వ్యక్తి'పై రేప్ కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపేందుకు సిట్‌ను కూడా ఏర్పాటు చేశారు. మూడు రోజుల క్రితం వర్సిటీ హాస్టల్‌లో ఉం టున్న ఓ విద్యార్థినిపై ప్లంబర్ అత్యాచారం జరి పాడని ఆరోపిస్తూ విద్యార్థులు తెల్లవారు జాము న1గంటలకు బాలికల హాస్టల్ ముందు ఆం దోళనప్రారంభించారు. వార్డెన్‌కు చెప్పినా పట్టి ంచుకోలేదని వారు ఆరోపించారు. నినాదా లు చేస్తూ క్యాంపస్ పరిసరాల్లోని గదుల కిటి కీలు, అక్కడి వస్తువులు, వాహనాలను ధ్వంసం చేశా రు.విద్యార్థులుమధ్యాహ్నం వరకు హైవేపై బైఠా యించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

'సర్'కు తొలి పరీక్ష ఖైరతాబాద్..

ఉప ఎన్నికకు రంగం సిద్ధం



హైదరాబాద్, సెప్టెంబర్ 27 : రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ తొలి పరీక్షకు సిద్ధమవుతున్నది. 'సర్' ముగిసిన తర్వాత జరుగబోయే తొలి ఎన్నికలుగా ఖైరతాబాద్ బైపోల్ ప్రాధాన్యం సంతరించుకున్నది. దానం నాగేందర్ అనర్హతకు సంబంధించిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. నిబంధనల ప్రకారం ఖాళీ అయిన అసెంబ్లీ స్థానానికి ఆరు నెలల్లోగా ఉపఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. ఈలోగా 'సర్' ప్రక్రియ కూడా పూర్తికానున్నది. అయితే, ప్రస్తుతం 'సర్' ప్రక్రియలో ఓటర్ల జాబితాలో భారీగా మార్పులు చోటుచేసుకోవడం ఉపఎన్నికపై ఆసక్తిని మరింత పెంచుతున్నది. 'సర్' ప్రక్రియ ప్రారంభానికి ముందు ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,93,667 మంది ఓటర్లు ఉన్నారు. అయితే డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదలయ్యే సమయానికి ఈ సంఖ్య 1,70, 195కు తగ్గింది. 'సర్'లో భాగంగా ఎన్యుమరేషన్ ఫామ్‌లు సమర్పించినవారిని మాత్రమే డ్రాఫ్ట్ జాబితాలో చేర్చారు. 1,23,472 మంది పేర్లు తొలగించారు. వీరిని ప్రధానంగా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డబుల్ ఓటు (ఏఎస్‌డీడీ) క్యాటగిరీల కింద గుర్తించారు. తొలగించిన ఓటర్లలో అత్యధికంగా 95,082 మంది ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్టు ఎన్నికల అధికారులు గుర్తించారు. మరణించినవారు, డూప్లికేట్ ఓట్లు, ఇతర కారణాలతో గైర్హాజరైనవారిని కూడా ఏఎస్‌డీడీ క్యాటగిరీలో చేర్చారు.ఈ భారీ మిగతా 3లో..

బ్యాంకుల సమ్మె వాయిదా

- 5 రోజుల పని విధానంపై చర్చించేందుకు కమిటీ
- అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం గుర్తిస్తాం
- అక్టోబరు 2న 'నో యూపీఐ డే' రిటైల్ చెల్లింపులకు అవరోధం



న్యూఢిల్లీ, సెప్టెంబర్-27 : దేశవ్యాప్తంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు (సెప్టెంబర్ 28-30) నిర్వహించాల్సిన బ్యాంకు ఉద్యోగుల సమ్మె చివరి నిమిషాల్లో వాయిదా పడింది. ఆదివారం రాత్రి ఈ విషయాన్ని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ప్రకటించింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్(ఐబీఏ-బ్యాంకుల యాజమాన్యాల ప్రతినిధి సంస్థ)తో జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. దీంతో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల శాఖలు యాథావిధిగా పనిచేయనున్నాయి. వారంలో ఐదు రోజుల పని విధానాన్ని ప్రవేశపెట్టాలని, మరికొన్ని కీలక డిమాండ్లతో యూఎఫ్‌బీయూ మూడు రోజుల సమ్మెను తలపెట్టింది. ఉద్యోగులపై పని భారం అధికంగా ఉన్నందున వారంలో సోమవారం నుంచి శు క్రవారం వరకే పనిదినాలు ఉండాలని బ్యాంకు ఉద్యోగులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి నెలా రెండవ, నాల్గవ శనివారాలు బ్యాంకు ఉద్యోగులకు సెలవులుగా ఉన్నాయి. అదే మాదిరి మిగిలిన అన్ని శనివారాలను సెలవుగా ప్రకటించడంపై చర్చించేందుకు ఐబీఏ, యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని మిగతా 3లో..

యూపీలో వర్ష బీభత్సం..
56 మంది మృతి



న్యూఢిల్లీ, సెప్టెంబర్-27 : ఉత్తరప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలా కుతలంచేస్తున్నాయి. దాదాపు 60 గంట లుగా ఎడతె రిపి లేకుం డా కురు స్తున్న వర్షా లతో రాష్ట్రవ్యాప్తంగా వరదలు సంభవించా యి. పలు ప్రాంతాలు నీట మునిగాయి. రాష్ట్ర ప్రభుత్వ గణాం కాల ప్రకారం 56 మంది మృతి చెంద గా, మరో 46 మంది గాయపడ్డారు.పలు జిల్లాల్లో పంటలు దెబ్బతి న్నాయి. వర్షాల కారణంగా సీతాపూర్‌లో అత్యధికంగా ఏడుగురు మృతి చెందారు. లక్నోలో శనివారం వరకు 21 గంటల్లో 125.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయోధ్యలో భారీ వర్షాలు కురుస్తుం డటంతో, భక్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దేవాదాయ శాఖలో అవినీతి జలగలు

- కీలక అధికారికి వాటాలు!
- ప్రధాన ఆలయాల సెక్షన్‌లో అడ్డగోలు వసూళ్లు!



హైదరాబాద్, సెప్టెంబర్ 27 : ఆ సెక్షన్‌లోకి ఒక ఫైల్ వెళ్లిందంటే చాలు.. అది కమిషనర్ వరకు వెళ్లి.. తిరిగి ఆ ఉత్త ర్వుల కాపీ వచ్చే వరకు జరిగే తతంగమంతా ఆ సెక్షన్ సిబ్బంది చేతుల్లోనే ఉంటుంది. సెలవులు మొదలు ప్రమోషన్ల వరకు పెద్ద దేవాలయాలకు సంబంధించి ఉద్యోగపరమైన రకరకాల అంశాలు ఆ సెక్షన్ చేతిలోనే ఉంటాయి. కమిషనర్‌ను కలిసినా, ఆ సెక్షన్ ఉద్యోగి కరుణించనిదే సంబంధిత ఫైల్ ఒక్క అడుగు కూడా ముందుకు కదలదు. ఇందుకోసం ఆ ఉద్యోగులను ప్రసన్నం చేసుకోవాలి. వారు అడిగింది ముట్టజెప్పాలి. తెలంగాణ దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలోని బీ సెక్షన్‌లో జరుగుతున్న అక్రమాల బాగోతమిది. రాష్ట్రంలోని వేములవాడ, కొండగట్టు, కొమురవెల్లి, భద్రాచలం, జోగుళాంబ వంటి దేవాలయాలకు సంబంధించి ఏ ఫైల్ అయినా బీ సెక్షన్‌కు వెళ్లాల్సిందే. ఆ సెక్షన్‌లో ప్రతిరోజూ లక్షల రూపాయలు చేతులు మారుతుం టాయి. ఒక్కో ఫైల్‌కు మిగతా 3లో..

ఎంబీబీఎస్‌లో అదనపు ఫీజుల దోపిడీని అరికట్టాలి



- హాస్టళ్లలో వసతులు కల్పించాలి : మెడికో పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్
- సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపు మిగతా 3లో..

వచ్చే ఏడాది గిన్నిస్ రికార్డు సాధించేలా బతుకమ్మ

విదేశాల్లో వేడుకలు : కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, సెప్టెంబర్ 27 : ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వాలు గిన్నిస్ రికార్డు కోసం వేడుకలు నిర్వహించినా సఫలం కాలేదని... వచ్చే ఏడాది ఈ రికార్డ్ సాధించడమే ధ్యేయంగా సంబురాలు నిర్వహిస్తామని టీఆర్ఎస్, తెలం గాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆదివారం తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జాగృతి రూపొందించిన బతుక మ్మ పాటల సీడీ, సంబురాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో, విదేశాల్లో జాగృతి ఆధ్వర్యంలో బతు కమ్మ వేడుకలు నిర్వహిస్తామన్నారు. తెలంగా ణలోని మహిళలంతా పాల్గొనాలని, సాంప్రదా య బతుకమ్మ పాటలను భావితరా లకు అం దించేందుకే చప్పట్ల పాటలతో సీడీ రూపొందిం చామని కవిత పేర్కొన్నారు. కాగా వచ్చే ఏడాది రెండున్నర లక్షలమందితో బతుకమ్మ ఔన్నత్యాన్ని చాటేలా వేడుకలు నిర్వహిస్తామని.. ఇందుకోసం గ్రామాలు, పట్టణాల్లో బతుకమ్మ, కోలాటం కమిటీలు వేస్తామన్నారు.


చిట్టీలు, వడ్డీ పేరుతో రూ.7కోట్లతో టీచర్ పరార్

సూర్యాపేట జిల్లాలో ఘటన



మిగతా 3లో..

నిమ్స్‌కు రిమ్స్ బాధితురాలు



- చిన్నారులను కాపాడిన స్టాఫ్‌నర్స్ పరిస్థితి విషమం
- అగ్ని ప్రమాదంతో ఊపిరితిత్తులు, కాలేయంపై తీవ్ర ప్రభావం

ఎదులాపురం, సెప్టెంబర్ 27 : ఆదిలాబాద్ రిమ్స్ దవాఖానలో గత సోమవారం చోటు చేసుకొన్న అగ్నిప్రమాదంలో పిల్లలను కాపాడిన స్టాఫ్‌నర్స్ ప్రమీల పరిస్థితి విషమించింది. ఆమెను ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ప్రమాద సమయంలో పొగతో నిండిన గదిలో పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించిన ఆమె వారం రోజులుగా ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ప్రమీలకు ఊపిరితిత్తులు, కాలేయంపై ప్రభావం పడడంతో ఆమె పరిస్థితి విషమించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలించారు. ప్రమీలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరామర్శించారు.

తెలంగాణ ఉద్యమానికి 'బాపూజీ' పెద్దదిక్కు

బీఆర్ఎస్ హయాంలోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, సెప్టెంబర్ 27: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలకు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ పెద్దదిక్కుగా నిలిచారని, ఆయన చేసిన సేవలు, త్యాగాలను ఘనంగా స్మరించుకోకపోతే తెలంగాణ సమాజం తనను తాను అవమానించుకున్నట్టేనని మాజీ మంత్రి వే ముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని, నివాళులర్పించారు.

బీఆర్ఎస్ హయాంలోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం


మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, సెప్టెంబర్ 27: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలకు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ పెద్దదిక్కుగా నిలిచారని, ఆయన చేసిన సేవలు, త్యాగాలను ఘనంగా స్మరించుకోకపోతే తెలంగాణ సమాజం తనను తాను అవమానించుకున్నట్టేనని మా జీ మంత్రి వే ముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొ న్నా రు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లిలో లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని, నివాళులర్పించారు. రాష్ట్రసాధన కోసం ఎవ రూ ముందుకు రాని రోజుల్లోనే మంత్రి పదవికి రాజీనామా చేసిన అసలైన ధీరశాలి బా పూజీ అని వేముల కొనియాడారు. హైదరాబాద్‌లో ఉద్యమకారులు సమావేశమవడానికి ఎవరూ నిలువనీడ ఇవ్వనప్పుడు బాపూ జీ తన సొంత నివాసమైన జలదృశ్యాన్ని తెలంగాణ ఉద్యమానికి టీఆర్ఎస్ పార్టీకి అ ప్పగించి ఉద్యమానికి కొండంత అండగా నిలిచారని ప్రశంసించారు. బాపూజీ ఆశీస్సులు, ప్రోత్సహంతోనే నాటి ఉద్యమసారథి కేసీఆర్ నేతృత్వంలో ప్రజలు కదలివచ్చి స్వరాష్ట్రాన్ని సాధించుకున్న విషయాన్ని కేసీఆర్ పలుమార్లు గుర్తుచేసుకున్నారని తెలిపారు.

కారులో మంటలు..అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం

- సమాచారం అందుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు,
- అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు



హైదరాబాద్,సెప్టెంబర్-27 : హైదరాబాద్--బెంగళూరు జాతీయ రహదారిపై శంషా బాద్ సమీపంలో ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ సమయస్పూ ర్తితో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు వేగంగా వ్యాపిం చడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారులో శంషాబాద్ పరిధికి చేరుకోగానే ఇంజిన్ భాగం నుంచి పొగలు వెలువడటాన్ని డ్రైవర్ గమనించాడు. వెంటనే వాహనాన్ని రహదారి పక్కకు నిలిపి, అందులో నుంచి బయటకు వచ్చాడు. కొద్దిసేపటికే మంటలు పెద్దఎత్తున చెలరేగి కారు మొత్తాన్ని చుట్టుముట్టాయి. కారులో మం టలు ఎగిసిపడటాన్ని గమనించిన ఇతర వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. సమా చారం అందుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ప్రాథమికంగా ఇంజిన్ అధికంగా వేడెక్కడం లేదా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం కారణంగా హైదరాబాద్--బెంగళూరు జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

దయచేసి సిరిసిల్లలో ఆ సంస్కృతిని కొనసాగించవద్దు..

సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్,సెప్టెంబర్-27 : రాష్ట్రాన్ని నడిపించే ఒక బాధ్యతయుతమైన పదవిలో ఉన్నామన్న విషయాన్ని కూడా మరిచిపోయి, మీరు పర్యటించిన ప్రతిచోట కేవలం బూతు పురాణాలతో బురదజల్లే సంస్కృతిని దయచేసి సిరిసిల్లలో కొనసాగించవద్దంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన లేఖలో కోరారు.వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల, సిద్దిపేటలో కూడా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది.. త్వరలో సిరిసిల్ల, సిద్దిపేటలో సభలు పెట్టి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తానంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల స్పందిస్తూ.. సిరిసిల్లకి వచ్చి రాజన్నను దర్శించుకుని పాపప్రాప్తి చేసుకోవాలని రేవంత్ రెడ్డిని సూచిస్తున్నానన్నారని తెలిసిందే. ఈ క్రమంలో సిరిసిల్లకు వస్తున్న రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.రాష్ట్రాన్ని నడిపించే ఒక బాధ్యత యుతమైన పదవిలో ఉన్నామన్న విషయాన్ని కూడా మరిచి పోయి, మీరు పర్యటించిన ప్రతిచోట కేవలం బూతు పురాణాల తో బురదజల్లే సంస్కృతిని దయచేసి సిరిసిల్లలో కొనసాగించ వద్దంటూ కేటీఆర్ తన లేఖలో కోరారు. అయితే సిరిసిల్లలో 8000 ఎకరాల ప్రభుత్వభూమిని BRS నాయకులు దోచుకు న్నారని, అందులో నుండి 2400 ఎకరాలు మీ ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని మీరు అసెంబ్లీలో చేసిన నిరాధారమైన ఆరోపణలపై ఒక శ్వేతపత్రం విడుదల చేసిన తరువాతే సిరిసిల్లలో అడుగు పెట్టాలని లేఖలో డిమాండ్ చేశారు.అసలు బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల నియోజకవర్గంలో పంపిణీ చేసిన ప్రభుత్వ భూమి ఎంత..? అందులో నుంచి రికవరీ చేసినట్టుగా చెబుతున్న భూమి ఎంత..? అది ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్, ఏ రైతుకు చెందినది.. ఎంత విస్తీర్ణం వంటి సమగ్ర వివరాలను బహిరం గంగా ప్రకటించాలని కోరుతున్నానంటూ సుదీర్ఘ అంశాలను సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో కేటీఆర్ ప్రస్తావించారు.


ఏడాదిలోగా హెచ్-1బీ వీసా విధానంలో భారీ మార్పులు..!



న్యూఢిల్లీ, సెప్టెంబర్-27 : అగ్రరాజ్యం అమెరికా లో ఏడాదిలోగా అత్యంత కీలకమైన హెచ్-1బీ వీసా (ఎ-1దీ జఅయి) విధానంలో భారీ మార్పులు రానున్నాయి. విదేశీ కార్మిక వీసాల విషయంలో జరుగుతున్న మోసాలపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం గత కొంతకాలంగా ఉక్కుపాదం మోపుతున్నది. ఈ క్రమంలో ఈ మార్పులు అనివార్యమని తెలుస్తున్నది. ఈ మేరకు అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో స్వయంగా వెల్లడించారు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆంథోనీ.. రాబోయే 365 రోజుల్లో విదేశీ కార్మిక వీసా కార్యక్రమంలో కీలక మార్పులు చోటుచేసుకుంటాయని అన్నారు. మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు బృందాలు ఆధారాలు సేకరిస్తున్నాయని చెప్పారు. అరెస్టులకు తాము సిద్ధంగా ఉన్నామని, వాస్తవాలను అమెరికా ప్రజల ముందు ఉంచుతున్నామని అన్నారు. ఈ వ్యాఖ్యలనుబట్టి హెచ్-1బీ వీసా మోసాలపై ప్రభుత్వం ఎంత సీరియస్‌గా ఉందో తెలుస్తున్నది.నకిలీ వీసా దరఖాస్తులు, వేతనాల్లో అవకతవకలు, కార్మికుల దోపిడీ, అమెరికన్ ఉద్యోగులను తొలగించడం వంటి అంశాలపై అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ చర్యలు ప్రభుత్వ విస్తృత వ్యూహంలో భాగమని స్పష్టమవుతోంది. ఇప్పటికే కొంతమంది హెచ్-1బీ వర్కర్ల ప్రవేశంపై ఆంక్షలను పొడిగించిన ప్రభుత్వం.. వీసా దరఖాస్తులను సమీక్షించేటప్పుడు కంపెనీలు గతంలో ఉద్యోగులను తొలగించిన చరిత్రను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఏజెన్సీలను ఆదేశించింది.స్థానిక టెక్ ఉద్యోగాలను విదేశీ నిపుణులతో భర్తీ చేయకుండా నిరోధించేందుకు గతంలో 'ప్రాజెక్ట్ ఫైర్‌వాల్' వంటి కార్యక్రమాలను కూడా చేపట్టారు. కొన్ని కంపెనీలు, ఔట్‌సోర్సింగ్ సంస్థలు అమెరికన్ల వేతనాలను, ఉద్యోగాలను దెబ్బతీసేందుకు హెచ్-1బీ విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని విమర్శకులు అంటుండగా.. దేశంలో నిపుణుల కొరతను తీర్చడానికి ఈ వీసా ఎంతో అవసరమని దాని మద్దతుదారులు వాదిస్తున్నారు.

ఎంబీబీఎస్‌లో అదనపు ఫీజుల దోపిడీని అరికట్టాలి

- హాస్టళ్లలో వసతులు కల్పించాలి : మెడికో పేరెంట్స్
- అసోసియేషన్ డిమాండ్
- సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపు



న్యూఢిల్లీ, సెప్టెంబర్-27 : ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అదనపు ఫీజుల వసూళ్లను తక్షణమే అరికట్టాలని మెడికో పేరెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజుల సత్యనారాయణచారి డిమాండ్ చేశారు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి 'మెడికో పేరెంట్స్ ఫ్యామిలీ మీట్'లో ఆయన మాట్లా డుతూ.. తెలంగాణ వైద్య విద్యార్థులకు అన్యాయం జరుగకుండా చూడాలని, మెరుగైన హాస్టల్ వసతులు కల్పించాలని కోరారు. నాలుగున్నరేండ్ల ఎంబీబీఎస్ కోర్సుకు అదనంగా మరో ఆరునెలల ఫీజు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గత ఏడాది 20 మందికి, ఈ ఏడాది ఇద్దరు పేద విద్యార్థులకు అసోసియేషన్ ద్వారా ఫీజులు చెల్లించి అండగా నిలిచామని తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. జీవో నంబర్ 150 వల్ల స్థానిక విద్యార్థులకు నష్టం జరుగుతున్నదని, 6 నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలోనే చదివిన వారికే లోకల్ కోటా వర్తింపజేయాలని అన్నారు. సమస్యల పరిషారానికి తల్లిదం డ్రులు ఐక్యంగా పోరాడాలని సూచించారు. అరకొర వసతులతో నడుస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పొడిశెట్టి రమేశ్, పల్లవి ఎడ్యుకేషన్ డైరెక్టర్ మలా నవీన్‌కుమార్, అసోసి యేషన్ ప్రతినిధులు బొడ్డుపల్లి అంజయ్య, పీ సుజాత, రవికు మార్‌కొప్పుల,కట్టవెంకటరావు(కేవీఆర్) తదితరులు పాల్గొన్నారు.

బీరం లక్ష్మారెడ్డి దశ దిన కర్మలకు హాజరైన కేటీఆర్



హైదరాబాద్ (ది టైమ్స్ ఆఫ్ తెలంగాణ) : కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.కొల్లాపూర్ మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి (బి ఆర్ఎస్) తండ్రి బీరం లక్ష్మారెడ్డి (87) ఈనెల 17వ తేదీన పరమపదించగా ఆయన దశదినకర్మల కార్యక్రమాలు ఆదివారం రోజు సింగోటం గ్రామం వెలుపల ఉన్న హర్షవర్ధన్ రెడ్డి వ్యవసాయ క్షేత్రం లో జరిగినవి.ఈ నెల 18 న లక్ష్మారెడ్డి అంత్యక్రియలకు హాజరై ఆయనకు నివాళు లర్పించిన బి ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండవసారి బీరం లక్ష్మారెడ్డి దశదిన కార్యక్రమానికి ఆదివారం రోజు హాజరై ఆయన చిత్రపటానికి పూలు వేసి అంజలి ఘటిం చారు.తండ్రి మరణం తో దుఃఖ సాగరం లో ఉన్న బీరం హర్షవర్ధన్ రెడ్డి ని కేటీఆర్ ఆలింగనం చేసుకొని ఆయనకు మనోధైర్యం ను కల్పించారు.ఈ సందర్భం గా బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించి, తన ప్రగాఢ సాను భూతిని వారికి తెలియజేశారు.లక్ష్మారెడ్డి దశదినకర్మల కార్య క్రమం లో మాజీ కేటీఆర్ తో పాటు మాజీ మంత్రులు గుంత కండ్ల జగదీష్ రెడ్డి, సింగి రెడ్డి నిరంజన్ రెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, సి. లక్ష్మా రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డిలతో పాటు పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని దివంగత నేత లక్ష్మారెడ్డి కి నివాళులు అర్పించారు.అలాగే మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెము రామ్మోహన్ రెడ్డి కూడా లక్ష్మారెడ్డి ఆంత్య క్రియలకు హాజరై లక్ష్మారెడ్డి కి నివాళులర్పిస్తూ బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలియజేశారు.

కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన ఎస్టీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలి



హైదరాబాద్,సెప్టెంబర్-27 :కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన ఎస్టీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని నంగారా బేరీ లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ధరావత్ గణేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన జాతీయ అధ్యక్షునిగా ఎన్నికైన ధరావత్ గణేష్ నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రాజ్‌కుమార్, ఎపీ రాష్ట్ర అధ్యక్షు ముడవత్ రవీందర్ నాయక్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సుశీల బాయ్ తదితరులు ఎన్నికయ్యారు. ధరావత్ గణేశ్ నాయక్ మాట్లాడుతూ ఇచ్చిన హమీలు అమలు చేయకపోతే వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తామని హెచ్చరించారు. గిరిజనులు రాజకీ యంగా అణగ దొక్కాలనే గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వకుండా సీఎం రేవంత్ రెడ్డి అడ్డుకుంటున్నాడని ఆరోపిం చారు. నాయకులు పూల్ సింగ్ నాయక్, పరుశురాం నాయక్, సుహాసిని, శివాణీ, తనిష్క, సుశీల, ఇందల్ రాథోడ్, వెంకట్ బంజార, రాజ్‌కుమార్.జైపాల్ నాయక్, పాల్గొన్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

సాగు గోస.. సర్కార్ తమాషా

40 శాతానికి పైగా పంటనష్టం జరిగిందని వాపోయారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని దేశీటిక్యాలలో రైతులను కలిసి పత్తి, మక్క పంటలను పరిశీలించి వారి సమస్యలు తెలుసుకున్నారు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. పత్తి రంగుమారిందని, కనీసం క్వింటాకు రూ.4 వేల ధర పలికే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు.ఆదివారం కొల్లాపూర్‌లో ఓ కార్యక్రమానికి హాజరై హైదరాబాద్ తిరిగి వెళ్లండగా దేశీటిక్యాల వద్ద రైతులు కేటీఆర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. పత్తి పంటలు భారీ గా దెబ్బతిన్నాయని, మక్క పంటకూ తీవ్ర నష్టం కలిగిందని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. వారి విజ్ఞప్తి మేరకు పంటలను పరిశీలించిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రెండెకరాల్లో మక్క సాగు చేసేందుకు 2 లక్షల అప్పు చేసి పెట్టుబడి పెట్టానని రైతు శేఖర్‌రెడ్డి చెప్పాడని, పెట్టుబడి అంతా పోయిందని కన్నీటిపర్యంతమయ్యాడని పేర్కొన్నారు. రైతులు శేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య, యాదమ్మ తదితరులు తమకు జరిగిన నష్టం గురించి వివరించారని, ఉమ్మడి పాలమూరు రైతులంతా ఇదే దుస్థితి ఎదుర్కొంటున్నారని తెలిపారు. నీళ్లు లేకపోవడమే కారణమని రైతులంటున్నరని చెప్పారు. గోదావరి, కృష్ణాలో నీళ్లు పుష్కల ంగా ఉన్నా.. 248 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అందుబాటులో ఉన్న నీటిని ఒడిసిపట్టి చెరువులు నింపడం, కాలువలకు మళ్లించేందుకు ఎత్తిపోతలు చేపట్టాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తి సామర్థ్యంతో నడుపడం లేదని విమర్శించారు. నీళ్లిస్తే పంటలు పండుతాయని, రైతుల నుంచి కొనాల్సి వస్తుందని, మద్దతు ధర, బోనస్, యూరియా, విద్యుత్తు తదితర అంశాలపై ప్రభుత్వం బాధ్యత తీసుకోవాల్సి వస్తుందనే సాగునీరివ్వడం లేదని దుయ్యబట్టారు.

మోటర్లు నడిచే పరిస్థితి లేదు

రైతులు విద్యుత్తు సమస్యలను కూడా తన దృష్టికి తెచ్చారని, సాయంత్రం 7 దాటితే సింగిల్ ఫేజ్ కరెంటే వస్తున్నదని, మోటర్లు నడిచే పరిస్థితి ఉండటం లేదని బాలపీరు అనే రైతు చెప్పారని కేటీఆర్ వివరించారు. ఓవైపు రైతుబంధు ఇవ్వడం లేదని, మరోవైపు కరెంట్, నీళ్లు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా ఉమ్మడి పాలమూరులో సుమారు 8.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. చెక్‌డ్యామ్‌లు నిర్మించి, చెరువులు నింపడంతో భూగర్భజలాలూ పెరిగాయని, ప్రస్తుతం పాలమూరు ప్రాంతం ఎండిపోతున్నదని, అయినా కృష్ణానీటిని ఏపీకే తరలిస్తున్నారని చెప్పారు.

మేము రాగానే అందరి లెక్క తేలుస్తాం

నిర్వహించిన చేరికల కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పని అయిపోయిందన్నారు. కారు గుర్తు మీద గెలిచి రేవంత్‌రెడ్డి పంచన చేరారని, ఎందుకు చేరారో తెలుసన్నారు. ఫున్సిమియాగూడలోని భూముల కోసమా? సుల్తాన్‌పూర్ కోసమా? దేనికి పోయారో మాకు తెలుసన్నారు. ఎవరినీ విడిచిపెట్టబోమని, అందరి లెక్కలూ తేలుస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడెక్కడైతే లుచ్చా పనులు చేస్తున్నారో.. ఎవరెవరైతే రెచ్చిపోతున్నారో.. ఎక్కడ అమ్ముడుపోయి వ్యవహారం చేస్తున్నారో.. అన్నీ తెలుసన్నారు. ఎవ్వరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. అన్నింటికీ టైం వస్తదని, అప్పుడు ఏం చేయాలో చేసి చూపిస్తామన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఎంబీబీఎస్ సీట్లు..

నివేదిక సమర్పించారు. దీని ఆధారంగా ఎస్టీ కోటాలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో 37 మంది అభ్యర్థులు ఉన్నట్టుగా వెలుగు చూడటంతో వారిని అనర్హులుగా ప్రకటించారు. ఇప్పటికే వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుక్కె విశృత్, సిద్దిపేట ఆర్‌వీఎం ఇన్‌స్టిట్యూట్‌లో ఇరుకుల హేమాద్రి, హైదరాబాద్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కళాశాలలో నేనావత్ కోవిద, నోవా ఇన్‌స్టిట్యూట్‌లో శంకరపురం రచన, ఉస్మానియా మెడికల్ కళాశాలలో మాలె సాయిహర్షిణి, వడిదె చంద్రహర్షిణి, పటాన్‌చెరు రాజరాజేశ్వరి మెడికల్ కళాశాలలో కాకి నాగశయన, టీఆర్ఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎం గాయత్రీచౌహాన్, కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో దేవరశెట్టి నిహాల్ సిద్ధార్థ్ పొందిన సీట్లు రద్దు చేసినట్టు యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. ఇకపై ఈ 37 మందిని ఎస్టీ క్యాటగిరీలో పరిగణించబోమని, జనరల్ క్యాటగిరీలో మాత్రమే పరిగణిస్తామని యూనివర్సిటీ స్పష్టం చేసింది. రద్దు చేసిన తొమ్మిది సీట్లను ఖాళీ సీట్లుగా ప్రకటించి మలి విడత కౌన్సెలింగ్ ద్వారా అసలైన తెలంగాణ ఎస్టీ విద్యార్థులకు మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్టు తెలియజేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ మరింత పక్కాగా చేస్తామని అధికారులు వెల్లడించారు.

'సర్'కు తొలి పరీక్ష ఖైరతాబాద్..

తొలగింపుతో ఖైరతాబాద్ నియోజకవర్గ ఓటర్ల సంఖ్యలో గణనీయమైన మార్పు చోటుచేసుకున్నది. అయితే డ్రాఫ్ట్ జాబితా ఆధారంగా తుది ఓటర్ల కూర్పుపై ఇప్పుడే స్పష్టమైన అంచనాకు రావడం సాధ్యం కాదు. 'సర్' ప్రక్రియలో మరో కీలక పరిణామంగా 81,404 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. 2002 నాటి జాబితాతో లింక్ కాకపోవడం, ఎన్యుమరేషన్ ఫామ్ వివరాల్లో వ్యత్యాసాలు ఉండటం వంటి కారణాలతో ఈ నోటీసులు ఇచ్చారు. నోటీసులకు సంబంధించి ఓటర్లు సమర్పించే వివరణలు, పత్రాలను పరిశీలించిన అనంతరం ఎంతమంది పేర్లు తుదిజాబితాలో తిరిగి చేరుతాయన్నది కీలకంగా మారింది. నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల దృష్టి ఇప్పుడు ఈ ప్రక్రియపైనే ఉన్నది.

బ్యాంకుల సమ్మె వాయిదా

నిర్ణయించినట్టు యూఎఫ్‌బీయూ ప్రకటించింది. "ఈ కమిటీ అన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తుంది. భాగస్వాములు అందరితో చర్చించి.. కష్టమర్లు సహా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని గుర్తిస్తుం ది"అని యూఎఫ్‌బీయూ తన ప్రకటనలో పేర్కొంది. స్కేల్ 4, అంతకుమించిన అధికారులకు పనితీరు ఆధారి త ప్రోత్సాహకానికి (పీఎల్ఐ) సంబంధించి పథకంలోనూ సవరణలపై ఐబీఏతో చర్చలు ప్రారంభిస్తామని తెలిపింది. మిగిలిన పెండింగ్ అంశాలపైనా ఇరువర్గాలు సత్వర పరిష్కారం కోసం చర్చిస్తాయని ప్రకటించింది. ఈ నేపథ్యం లో ప్రతిపాదిత సమ్మెను వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. కాగా, సమ్మె ప్రభావం ప్రజలపై భారీగా పడకుండా కేంద్రం చొరవతో ఆదివారం కూడా బ్యాంకులు పనిచేయడం విశేషం.

అక్టోబర్ 2న యూపీఐ బంద్!

అక్టోబర్ 2న షాపుల్లో యూపీఐ చెల్లింపులు నిలిచిపోనున్నాయి. ఎందుకంటే 'ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్'(ఏఐఎంఆర్ఏ) అక్టోబర్ 2ను 'నో యూపీఐ డే'గా ప్రకటించింది. అంటే ఆ రోజున దేశవ్యాప్తంగా మొబైల్ ఫోన్ల రిటైల్ స్టోర్లలో యూపీఐ చెల్లింపులను అనుమతించరు. ఏఐఎంఆర్ఏకి ఇతర రిటైల్ వర్తక సంఘాలు కూడా కొన్ని మద్దతు ప్రకటించాయి. రూ.2,000కు మించిన మర్చంట్ యూపీఐ(వర్తకులకు చేసే) చెల్లింపులపై 0.4శాతం ఎండీఆర్‌ను(మర్చంట్ డిస్కౌంట్ రేటు) కేంద్రం ఇటీవలే ప్రకటించడం గమనార్హం. అక్టోబర్ 15 నుంచి ఇది అమల్లోకి రానుంది. దీనిని వ్యతిరేకిస్తూ ఏఐఎంఆర్ఏ ఈ నిరసనకు దిగింది. అక్టోబర్ 2న రిటైలర్లు తమ దుకాణాల్లోని యూపీఐ క్యూఆర్ కోడ్స్‌పై నల్లటి వస్త్రం కప్పి నిరసన తెలియజేయనున్నారు.

దేవాదాయ శాఖలో అవినీతి జలగలు

ఒక్కో రేటు! ఆ ప్రకారం ముడుపులు చెల్లిస్తేనే ఫైల్ ముందుకు పోతుంది. ఈ వ్యవహారం కమిషనర్‌కు తెలిసినా, ఆయన ఎన్నిసార్లు మందలించినా అక్రమార్కుల్లో మాత్రం మార్పు రావడం లేదని దేవాదాయ అర్చక ఉద్యోగులు చెప్తున్నారు.అతను బీ సెక్షన్‌లో ఒక ఉద్యోగి. ప్రతినెలా అతని బ్యాంకు ఖాతాకు వేల రూపాయల ముడుపులు చేరుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, ఈ లావాదేవీలను అతను నేరుగా చేయకుండా, తన దగ్గర ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా, తాను నివసించే బహదూర్‌పురా ప్రాంతంలోని తన మిత్రుల నంబర్ల ద్వారా చేస్తున్నాడని ఆ సెక్షన్ ఉద్యోగులు చెప్పుకొంటున్నారు. ఈ విషయంలో అతనిపై ఎన్నిసార్లు, ఎంతమంది కమిషనర్లకు ఫిర్యాదులు చేసినా తన సామాజికవర్గ ముఖ్య ఉద్యోగులతో పైరవీలు చేయించుకుంటూ, వారికి తన ఆదాయంలో వాటాలు ఇస్తూ మొత్తం మేనేజ్ చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇది ఈ ఒక్క ఉద్యోగికే పరిమితం కాలేదు.దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలోని కొన్ని సెక్షన్లలో కొందరు ఉద్యోగులు చేస్తున్న అరాచకాలతో తాము విసిగిపోతున్నామని దేవాలయాల అర్చక ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ వ్యవహారాలకు సంబంధించిన ఆడియో రికార్డులు కూడా వైరల్ అయ్యాయి. తమ యూపీఐ లావాదేవీలకు సంబంధించి అధికారిక ఖాతాల్లోకే వేర్వేరు అకౌంట్ల ద్వారా డబ్బులు పంపించుకొంటున్నారని, కొందరేమో తమ కార్యాలయ ఆవరణలోకి వచ్చిన వారిని అక్కడి నుంచి వెనుక వైపునకు రమ్మని చెప్పి, కార్యాలయం పక్క సందులో ఉన్న హోటల్ వద్దకు కానీ, ఎదురుగా ఉన్న జిరాక్స్ సెంటర్‌కు కానీ పిలిచి అక్కడ తీసుకొంటున్నారని చెప్పారు. ఈ విషయంలో ఒక కీలక అధికారి కూడా ఈ అక్రమార్కులకు సహకరిస్తూ తన వాటా తాను తీసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఒక్క సెక్షన్‌కే పరిమితం కాలేదు.. ఆ శాఖలో గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి పై అంతస్తు వరకు ప్రతిచోటా ఇదే దందా నడుస్తున్నదని, ముఖ్యమైన విభాగాలు చూసే కొందరు ఉద్యోగుల కారణంగా మొత్తం శాఖకే చెడ్డ పేరు వస్తున్నదని ప్రధాన కార్యాలయంలో ఓ ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారు. ప్రతి దేవాలయానికీ సరుకులు సరఫరా చేసే ఒక కాంట్రాక్టర్ సామాజికవర్గానికి చెందిన ఓ ముగ్గురు ఉద్యోగులైతే సిండికేట్‌గా మారి ఏకంగా శాఖలో కమిషనర్ పేషీ వరకు మొత్తం వ్యవహారం నడుపుతున్నారని దేవాదాయ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి.కొందరు అధికారులైతే తమ పరిధిలోని ఆలయాల నుంచే ఉదయం టిఫిన్ మొదలుకొని రాత్రి భోజనం వరకు ఇంటికే తెప్పించుకు ంటున్నారనే చర్చ జరుగుతున్నది. ఇటీవల గ్యాస్ కొరత కారణంగా ఈ భోజనాలు, అన్నదానాలు కొంతకాలం ఆగిపోయినా మళ్లీ వ్యవహారం మొదలైనట్టు తెలిసింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన అధికారుల వ్యవహారంతోపాటు పలువురు ఉద్యోగుల అవినీతిపై ఆధారాలు సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా ఎవరూ మాట్లాడే పరిస్థితి లేదు. తమకు ఉన్న పరిచయాలు, ఎంతోకాలంగా తాము అదే సీటులో ఉంటూ అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకులతో ఉన్న సంబంధాలు, ప్రత్యేకించి ఆ శాఖ ప్రధాన అధికారులు, అదనపు అధికారులనుమంచిచేసుకొనేక్రమంలోచేసేఆర్జితసేవలు అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

ఆభూముల క్రమబద్ధీకరణకు ఆదేశాలు..!!



హైదరాబాద్, సెప్టెంబర్ 27 :

తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు భూముల చుట్టూ తిరుగుతున్నాయి. పెండింగ్ భూ సమస్యల పైన ప్రభుత్వం ఫోకస్ చేసింది. ఈ మధ్య కాలంలో 22ఏ భూముల వ్యవహారంలో రిలీఫ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. ఇప్పుడు ఖాజ పెండింగ్ దరఖాస్తుల పైనా స్పష్టత ఇచ్చింది. దశాబ్దాల కాలంగా పెండింగ్ లో ఉన్న భూముల సమస్యల పరిష్కారం దిశగా కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం భూముల వివాదాల పై కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఖాజ పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని ఆదేశించింది. ప్రజల భూ సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (ఖాజ) దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. GO 455, 456, 747, 92 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి.. అర్హత ఉన్న కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఇందుకోసం Memo No.48062 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. 2016లోనే దీనికి సంబంధించిన GO జారీ చేసినప్పటికీ గత ప్రభుత్వం దానిని అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అర్హత కలిగిన ఖాజ కేసులను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా 22-A భూ సమస్యలను కూడా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇప్పటికే GO 118, GO 76లకు అనుగుణంగా కీలక ఉత్తర్వులు జారీ చేశామని, 22-ఎ జాబితాలో ఉన్నప్పటికీ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి కల్పించినట్లు తెలిపారు. తాజాగా ఖాజ పెండింగ్ దరఖాస్తులపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో భూ సమస్యల పరిష్కారానికి మరో ముందడుగు పడిందన్నారు. మిగిలిన 22-ఎ సమస్యలను కూడా ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

సీఎం రేవంత్‌కు కేటీఆర్ 9 పేజీల బహిరంగ లేఖ..

8 వేల ఎకరాలపై సూటి ప్రశ్నలు!



హైదరాబాద్,సెప్టెంబర్-27 :

రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు సిద్ధమవుతున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ 9 పేజీల బహిరంగ లేఖ రాశారు. సెప్టెంబర్ 30న సిరిసిల్ల లో సీఎం భారీ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. రాజకీయ విమర్శ లకే పరిమితం కాకుండా జిల్లా ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులు, నేతన్నలు, రైతులు, భూ ముల అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు.సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకులు 8,000 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నా రంటూ గతంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను కేటీఆర్ లేఖలో ప్రస్తావించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు సిద్ధమవుతున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ 9 పేజీల బహిరంగ లేఖ రాశారు. సెప్టెంబర్ 30న సిరి సిల్లలో సీఎం భారీ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. రాజకీయ విమ ర్శలకే పరిమితం కాకుండా జిల్లా ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులు, నేతన్నలు, రైతులు, భూముల అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయ కులు8,000 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకు న్నారం టూ గతంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను కేటీఆర్ లేఖలోప్రస్తావించారు.తమపై చేసిన ఈఆరో పణలకు ఆధారాలు బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. 2,400 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నట్లయితే.. ఆ భూములకు సంబంధించిన గ్రామాలు, మండలాలు, సర్వే నం బర్లు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, లేదంటే సీఎం ప్రజలకు వివరణ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 8,000 ఎకరాల ఆరోపణలు, 2,400 ఎకరాల స్వాధీనం వంటి అంశాలు ప్రస్తుతం రాజకీయ నేతల మధ్య వివాదాస్పద ఆరోపణలు, ప్రతివాదాలుగా ఉన్నాయి. వాటికి సంబంధించిన పూర్తి అధికారిక వివరాలు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

నేతన్నల సమస్యలపై కేటీఆర్ ప్రశ్నలు

సిరిసిల్ల చేనేత, వస్త్ర పరిశ్రమకు సంబంధించిన అంశాలను కూడా కేటీఆర్ లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. నేతన్నలకు సంబంధించిన పెండింగ్ బకాయిల్లో రూ.60 కోట్లను ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలని కోరారు. అలాగే 10 శాతం యార్న్ సబ్సిడీ, నేతన్న బీమా పథకం, సిరిసిల్లలో యార్న్ డిపో, వీవింగ్ పార్క్, అపెరల్ పార్క్ వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.బతుకమ్మ చీరల పథకాన్ని కొనసా గించకపోవడంపై కూడా కేటీఆర్ ప్రశ్నలు సంధిం చారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రభుత్వం ఎలా పరిష్కరించబోతుందో చెప్పాలని కోరారు.

రైతులు, అభివృద్ధి పనులపై ప్రశ్నలు

రైతులకు సంబంధించిన పెండింగ్ రైతుబంధు చెల్లింపులు, రైతు భరోసా, రుణమాఫీ, రైతుబీమా, కౌలు రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు.మల్కపేట రిజర్వాయర్ నుంచి అప్పర్ మానేరు ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశంపై కూడా టైమ్‌లైన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ, విద్యా మౌలిక వసతులు, సాగునీటి పనులు, మార్కెట్ మౌలిక సదుపాయాలు, కొత్త పరిశ్రమలు వంటి అంశాలను కూడా లేఖలో ప్రస్తావించినట్లు తెలంగాణ టుడే నివేదించింది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెప్టెంబర్ 30న సిరిసిల్లలో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. సభకు ముందు ర్యాలీ నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతు న్నాయి. కాంగ్రెస్ శ్రేణులు సభ కోసం సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేటీఆర్ రాసిన రాజ కీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. భూముల ఆరోపణలు, నేతన్నల సమస్యలు, రైతుల అంశాలు, అభివృద్ధి పనులపై సీఎం ఏం సమాధానం ఇస్తారనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

8,000 ఎకరాల భూముల ఆరోపణలపై పూర్తి వివరాలు

2,400 ఎకరాల స్వాధీనంపై ఆధారాలు
నేతన్నల పెండింగ్ బకాయిల చెల్లింపు
10 శాతం యార్న్ సబ్సిడీపై స్పష్టత
నేతన్న బీమా పునరుద్ధరణ
రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై స్పష్టత
సిరిసిల్ల అభివృద్ధికి అదనపు నిధులు
పెండింగ్ అభివృద్ధి పనులకు నిధుల విడుదల
మొత్తంగా సీఎం సిరిసిల్ల పర్యటన సందర్భంగా ప్రజా సమస్యలపై సమాధానాలు ఇవ్వాలని కేటీఆర్ తన బహిరంగ లేఖలో కోరారు. మరోవైపు ప్రభుత్వం ఇప్పటికే సిరిసిల్ల అభివృద్ధి, రైతులు, నేతన్నల సంక్షేమానికి చర్యలు తీసుకుం టున్నట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

గిరిజన సంస్కృతిని కాపాడుదాం



- **గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్**

హైదరాబాద్,సెప్టెంబర్-27 : అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, ఉనికిని కాపాడుకోవడానికి గిరిజన సంఘాల నేతలు ముందుకు రావాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ పిలుపు నిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ధర్మ నాయక్ అధ్యక్షతన జరిగిన గిరిజన ఆత్మీయ సమ్మేళ నంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరా టంలో అమరుడైన ఠానూ నాయక్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని, బంజారాలు మాట్లాడే 'గోర్ బోలి' లిపిని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. అక్టోబర్ 10,11 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే నంగారా ఉత్సవాలకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు 'చేవెళ్ల డిక్లరేషన్' పేరుతో గిరిజనులకు ఇచ్చిన 12 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని ధ్వజమెత్తారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ గారి మాటలు వ్యక్తిగతమా..? బిజెపి విధానమా..?

తెలంగాణ బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : కేంద్ర మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్‌బీసీ-డీ కులాలను బీసీ-ఏ కేటగిరీలో కలపాలని చేసిన వ్యాఖ్యలను తెలంగాణ బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి, రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది.బీసీ-డీ కులా లపై ప్రేమ అంతగా కారిపోతే ముందుగా బీసీ-ఏలో ఉన్న కులాల హక్కుల పరిరక్షణకు ఎలాంటి చర్యలు సూచిస్తారో బీజేపీ వెల్లడించాలి.కేంద్ర మంత్రి బండి సంజయ్ మాటలు వ్యక్తిగతం అయితే బీజేపీ అధ్యక్షుడు ఆయనకు షోకాజ్ నోటీసు ఇచ్చి వివరణ కోరాలి.

చిట్టీలు, వడ్డీ పేరుతో



రూ.7కోట్లతో టీచర్ పరార్

సూర్యాపేట జిల్లాలో ఘటన

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : ఓ ప్రభుత్వ టీచర్ చిట్టీలు, అధిక వడ్డీ పేరుతో పలువురిని నమ్మించి రూ.7కోట్లు వసూలు చేసి కనిపించ కుండా పోయాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లాలో వెలుగు చూసిం ది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... చివ్వెంల మండలం లక్ష్మీనాయక్ తండా పరిధిలోని ఏనెగంటి తండాకు చెందిన బానోత్ రాజు ఆత్మకూర్ (ఎస్) మండలం శెట్టిగూడెం ప్రభుత్వ పాఠశాలలో టీచర్ గా పని చేస్తూ సూర్యాపేటలోని 60 ఫీట్ల రోడ్డులో నివాసం ఉంటున్నాడు. టీచర్ గా పనిచేస్తూనే పదేండ్లుగా చిట్టీలు నడిపించడంతో పాటు పలువురి వద్ద నుంచి డబ్బులు తీసుకున్నాడు. బ్యాంకులకంటే ఎక్కువవడ్డీ ఇస్తానని చెప్పడంతో రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, పోలీసులతో పాటు వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు రాజుకు డబ్బులు ఇచ్చారు. ఓ ప్రభుత్వ టీచర్ సుమారు రూ.1.50 కోట్లకు హామీ ఇవ్వడంతో పాటు, మరో రూ.60 లక్షలు వడ్డీకి ఇచ్చినట్లు తెలుస్తోంది. రాజు పది రోజులుగా కనిపించకపో వడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో డబ్బులు ఇచ్చిన వారు ఆయన ఇంటికి వెళ్లి చూడగా.. తాళం వేసి కని పించింది. కుటుంబ సభ్యులు సైతం అందుబాటులో లేకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి చివ్వెంల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం సూర్యా పేట ఎస్పీ నర్సింహను కలిశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, రాజు కోసం గాలిస్తున్నట్లు చివ్వెంల ఎస్సై మహేశ్ తెలిపారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శంషాబాద్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి కేటీఆర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తొలిదశ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆయన మలి దశ ఉద్యమంలో సైతం ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. ఆయన సేవలు తెలంగాణ సమాజం ఎప్పుడూ మరిచిపోదని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

ఉద్యమాల జంగ్ సైరన్ : విమలక్క

సంపాదకీయం

సమస్త రంగాలను పురుషాధిపత్యమే ఆక్రమించిన సమాజం మనది. అందుకు సాంస్కృతిక ఉద్యమం కూడా మినహాయింపు కాదు. అందుకే మహిళా కళాకారులను గురించి మాట్లాడాల్సి వస్తే పిడికెడు మంది కూడా గుర్తుకు రారు.

ఇది సాంస్కృతిక సంస్థల ఫెయిల్యూర్! సమాజం లోనే కాదు,సాంస్కృతిక సంఘాల్లోను వేళ్ల మీదికే పరిమితం చేయబడ్డారు మహిళలు, మహిళా కళాకారులు. ఇలాంటి నేపథ్యంలో సకల ఆధిపత్యాలను ధిక్కరిస్తూ తారాజువ్వలా దూసుకువచ్చిన ఎర్రెర్రని గానం విమలక్క. పాటను తూటాలా పేల్చగలిగిన శక్తిసామర్థ్యాలు కలిగిన విమలక్క పాటకు యాభై యేళ్లు నిండాయి. ఈ సం దర్భంగా ఆ పాటల కోయిల కృషిని, పోషించిన పాత్రను తప్పకుండా ఈ సందర్భంగా బేరీజు వేసుకోవాలి. ఆగిపోని, అలసి పోని ఆ మహా కళాకారిణికి ఈ సమాజం ఎంతో బాకీ పడింది. ఆమె, ఆమెలాంటి ప్రజాకళాకారులు గొంతెత్తి దుంకి ఆడకుంటే ఇంతటి ప్రజాచైతన్యం ఎక్కడో ఆగిపోయేది. అరుణోదయ సాంస్కృతిక పతాకను అంతెత్తున ఎగరేసిన పాటల పోరాటకెరటం తాను. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిందంటే అందులో విమలక్క పాట పోషించిన పాత్ర చారిత్రాత్మకమైంది.

అరుదైన కళాకారిణి...దేశంలోనే అరుదైన సాంస్కృతిక కార్యకర్త విమలక్క. బంద్రు నర్సింహులు బిడ్డగా చిన్ననాటి నుండే విప్లవదారిలో నడిచిన నేపథ్యం తనది. పూర్వ నల్లగొండ జిల్లా ఆలేరు మట్టి అందించిన చైతన్యంతో ప్రజాపోరాటాల్లోకి దూసుకు వచ్చింది. విద్యార్థి దశ నుండే ప్రగతిశీల బాట నడిచింది. తనదైన ముద్రను వేయగలిగింది. అలా మొదలైన పాటల ప్రవాహగానం ఇవాళ ఈ దశకు చేరింది. విమలక్క పాటందుకుంటే ఒక సన్నని సెలయేరులా మొదలై, ఉప్పొంగే జలపాతంలా మనల్ని ఆవహిస్తుంది. వింటున్న వారిలో ఆలోచనల్లో అలజడులు రేపుతుంది. రక్తాన్ని మరిగించి మెదళ్లను సాయుధం చేస్తుంది. మన భుజాల మీద మిగిలే ఉన్న కర్తవ్యాన్ని బోధిస్తుంది. దోపిడి పాలకుల గుట్టును విప్పు తుంది. దోచుకుంటున్న పెట్టుబడిదారుల కుట్రల మీదికి సివంగిలా దుం కు తుంది.జైలుకైనాసరే సై అంటుంది. విమలక్క గొంతులో బాధి తుల ఆర్తనాదాల ఆకలిమంట ఉంటుంది. దగాపడ్డ పీడితుల తిరుగుబాటు ధిక్కారంఉంటుంది.అందుకే ఆమెకు 'ప్రజాగాయిని' అనే గుర్తింపు దక్కింది. గద్దర్ తరువాత పాటను ప్రదర్శన కళగా మలిచింది విమలక్క బృందమే. ఎర్రని జెండా పిడికిట ఎత్తిపట్టి చిన్నారి చెల్లెల్ల గుంపుతో తాను వేదిక మీదికి వచ్చేటప్పుడు, తల్లికోడిని తలపిస్తుంది విమలక్క. అలా పెనుమంటల సవ్వడిలో, పాటల జడివానై కురుస్తుంది. పాటకు పర్యాయపదంగా జీవించింది. వేదన పెల్లుబికె గుండెల్లో పిడికెడు భరోసాను నింపే ధైర్యమయ్యింది. దిక్కుమొక్కులేని జనం పక్షాన గొంతెత్తి నిలబడ్డప్పుడు పెద్దదిక్కయి గర్జించింది. ఉద్యమాలు, పోరాటాల మీదుగా కొత్త పొద్దయి పొడిసింది విమలక్క. తెలంగాణ ఉద్యమకాలానికి ధూంధాం వేదికలమీదఅరుణారుణ కిరణపు మోదుగుపువ్వై నిలిచింది. నాట్లేసే కూలి తల్లుల ఆహార్యంలో ఎర్రచీర కట్టి, భుజాన గొంగడేసి గంతులేసి పాటల మత్తడి దుంకింది. ప్రజా ఉద్యమాలకు గొంతుకను ఇచ్చిన అక్కలు, చెల్లెలు ఎందరి స్వరమై ముందుకొచ్చిన ప్రతిఘటనా భాస్వరం. సభానంతర సాంస్కృతిక కాలాల దగ్గరి నుండి ముఖ్య అతిథిగా పాటల నాయకురాలినే పిలవాలని జనం తలిచేలా నిలిచింది ఆమె కార్యాచరణ.

సవాళ్లను అధిగమించి...భారత దేశ సాంస్కృతిక ఉద్యమాల చరిత్రలో మహిళా కళాకారులకు తగిన గుర్తింపు, గౌరవాలు దక్కలేదు. జానపదంలో ఒక జీతెన్ భాయి, తెలంగాణ పోరాటంలో బెల్లి లలిత ఇట్లా కొందరే కనిపిస్తారు. పితృస్వామ్య, కులస్వామ్య కంచెలన్నీ దాటుకుని నిలబడ్డది విమలక్క. సమాజ అడ్డుగోడలనే కాదు, సాంస్కృతిక అడ్డుగోడల సవాళ్లను సైతం బద్దలు కొట్టింది. ఎక్కడ పాట అవసరం ఉంటే అక్కడ వాలిపోయింది. గడిచిన యాభై యేళ్ల కాలంలో ఆమె పాటల ప్రయాణానికి విరామం అన్నదే లేదు. రాజ్యం ఎన్ని నిర్బంధాలు పెట్టినా ఆ సంకెళ్లను తెంచుకుని ఆడిపాడింది. తన పాటను నిషేధించాలనుకున్నా, తన ఆఫీసుకు తాళాలు వేసి ముట్టడించినా, అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపినా నిరాశ చెందలేదు. అంతే ఆక్రోశంతో 'కాలంబు రాగానే కాటేసి తీరాలె'అంటూ పాటందుకుంది. ఒక గొంతు ఇంత సుదీర్ఘ కాలం ప్రజా ఉద్యమాల్లో నిలబడి ఉండడం అంటే మాటలు కాదు. చాలా మంది మహిళాకళాకారులు ఎక్కడో ఒక చోట ఆగిపోక తప్పదు. మన పురుషాధిక్య సమాజం వారిని అలా కట్టడి చేస్తుంది. పెళ్లి, కుటుంబ బాధ్యతలనే బరువులను తల మీదికి ఎత్తి నాలుగు గోడల మధ్యన బందీని చేస్తారు. 'మాజీ కళాకారిణి' అనే ట్యాగ్ తలిగిస్తారు. విమలక్క మాత్రం ఏనాడు రాజీపడింది లేదు. తన సహచరుడు మిత్ర అందించిన పాటల అంబుల పొదిని భుజానేసుకుని శత్రువుల గుండెల్లో ముచ్చెమటలు పోయించింది. లక్షలాది మం దిని కదిలించింది. ఊరూర ప్రజా చైతన్యానికి జీవం పోసింది. పాటలోనే బతుకును చూసుకుంది. పోరాటమే తన చిరునా మాను చేసుకుంది. మానని గాయాల పల్లేరు ముళ్లను దాటుకుంటూ ముందుకు సాగింది. తనను తాను మరిచి ఉద్య మాలకే అంకితమై సాగింది.అందుకే తెలంగాణలో విమలక్క పాటలేని ఉద్యమాలను ఊహించలేం. రాష్ట్ర సాధనను కలగనలేం.

పోరాటాల పొలికేక..అరుణోదయ బృందగానానికి ఎనగర్ర విమలక్క. సందర్భానికి తగినట్టుగా ఏ పాట పాడాలి? ఎలా పాడాలి? వింటున్న బాధితులు ఎవరు? వారి బాధ ఏమిటి? దానికి విముక్తి ఏమటనే ఆలోచన తన మెదళ్లో క్షణాల మీద జరిగిపోతుంది. అలా పాటలో లీనమైపోతుంది. పాట ముగింపుకు వచ్చేసరికి ఆమె పిడికిలి బిగుసుకుంటుంది. అది చూసిన జనాల పిడికిళ్లు సైతం బిగుసుకుంటాయి. అట్లా జనాన్ని మారుస్తూ, పోరాటాలకు సన్నద్ధం చేస్తూ సాగిన విమలక్క పయనానికి తెలుగు నేలే కాదు, యావత్ దేశమే సాక్ష్యం. అడవులు, మైదానాలు ఆమె పాటకు పులకించాయి. తెలంగాణ ఉద్యమ వేదికలు వేడెక్కాయి. అణగారిన జాతుల అస్తిత్వ పోరాటాలు పదునెక్కాయి. అరవైయేండ్ల ఆకలి మంటల పోరాటం తెలంగాణ ఉద్యమం. ఆ ఉద్యమంలో వందలాది సభల్లో విమలక్క "ఆడుదాం డప్పుల్ల దరువెయ్‌రా" అని గళం ఎత్తితే, ఇక తెలంగాణ తప్పకుండా వస్తుందనే భరోసా కలిగింది. "ఛలో ధూంధాం తెలంగాణ జాతరొచ్చెరా/మత్తడి దునికి అలుగు తన్నుకుని పారినట్టు/ మెత్తని గుండెలు సైతం నగారై మోగినట్టు..."అంటూ అంతెత్తున దునికి పాడుతుంటే లడాయికి లగాంచి దునుకాలనిపించింది. అదీ విమలక్క పాటకున్న సమ్మోహన శక్తి. సమైక్య పాలకుల కపట ప్రేమకు తెలంగాణ పట్టిపోయిన దు:ఖానికి పల్లవి, చరణం విమలక్క పాటే. పాలమూరు బతుకులు వసివాడిపోయాయని "పల్లె పల్లెన పల్లెర్లు మొలిసే పాలమూరులోన"అని విమలక్క పాడితే జనం ఇల్లుదాటి, పల్లెదాటి రోడ్ల మీదికొచ్చింది. "సినుకూ సినుకు తడిసిన నేలన చిత్రమైన వాసన" అంటూ విమలక్క పాటెత్తుకుంటే మట్టిపరిమళం మన ముక్కుపుటలను తాకుతుంది.ఆగొంతులో మబ్బుపట్టిన వానాకాలం మన మనసులోకి వచ్చి నిలుస్తుంది. కాసేపు మైమరిపోయేలా చేస్తుంది ఆమె గొంతు. విమ లక్క పాటల్లోనే కాదు, తన ఆచరణలోనూ ఒక ప్రజాస్వామిక దృక్పథం ఉంది. బాధితుల పక్షాన నిలబడాలనే తపన తన జీవలక్షణంగా మార్చుకుంది. అది తన రోజువారి జీవితంలో భాగం చేసుకుంది. అందుకే దగాపడ్డ దళితుల కోసం 'పాటసాయం'చేసి మద్దతుగా నిలబడ్డది. "మాదిగోళ్ల డప్పులొచ్చెనే...మానవహక్కుల దండోరేసి"అంటూ మండే మాదిగ డప్పై మోగింది విమలక్క. సమాజ మార్పు కోసం తప్పకుండా "ఎవరో ఒకరు ఎపుడో అపుడూ..."తప్పకుండా పుడుతూనే ఉంటారనే నమ్మకాన్ని తన గొంతులో పలికిస్తుంది.ఈ యాభై యేళ్ల పాటల ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ప్రజాగాయని విమలక్క. ఇంకా ప్రజాక్షేత్రంలో తన గొంతునే ఆయుధంగా ఉద్యమిస్తున్న అంకితభావానికి జేజేలు. బహుజన బతుకమ్మై ఊరూర పోరుముగ్గులు పోస్తున్న ఈ నిరంతర పాటల యుద్ధానికి జై భీమ్‌లు! ప్రజా కళల జాతరకు పరిపరి దండాలు!!

(విమలక్క పాటకు యాభై యేళ్లు నిండినవేళ... యాభై గంటల పాటు "ప్రజాకళల జాతర"నిర్వహిస్తున్న సందర్భంగా)

ఆ యూనివర్శిటీ మిడ్ టర్మ్ పరీక్షలు వాయిదా

నేటి నుంచి క్లాసులు బంద్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 :

పంజాబ్ ఫగ్వారాలో ఉన్న లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. వర్సిటీ క్యాంపస్ లో ఓ విద్యార్థినిపై బయటి వ్యక్తి అత్యాచారం చేశాడనే ఆరోపణలతో తోటి విద్యార్థులు భారీ ఎత్తున హింసాత్మక నిరసనలకు దిగారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ కీలక నిర్ణయం తీసుకుంది. నేటి నుంచి 10 రోజుల పాటు తరగతులను పూర్తిగా రద్దు చేసింది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. తరగతుల రద్దుతో పాటు మిడ్ టర్మ్ పరీక్షలు కూడా వాయిదా పడ్డాయి. తదుపరి నోటీస్ వెలువడేంత వరకు ఈ పరీక్షలను వాయిదా వేస్తోన్నట్లు వర్సిటీ వెల్లడించింది. విద్యార్థులందరి భద్రత, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొంది. ఈ 10 రోజుల కాలంలో విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లడానికి యాజమాన్యం అనుమతి ఇచ్చింది. వెళ్లలేని విద్యార్థులు హాస్టళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించింది. దీనిపై మార్గదర్శకాలు జారీ చేసింది. క్యాంపస్‌లోకి ప్రవేశించిన ఓ ప్లంబర్ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డాడని, దీనిపై హాస్టల్ వార్డెన్ స్పందించలేదని ఆరోపిస్తూ ఎల్పీయూ విద్యార్థులు శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ ఎత్తున నిరసనలు



చేపట్టిన విషయం తెలిసిందే. అక్కడి ఫర్నిచర్ ను తగులబెట్టారు. అడ్మిన్ బిల్డింగ్ అద్దాలను పగులగొట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు జాతీయ రహదారి-44ను సైతం స్తంభింపజేశారు. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ప్రయత్నించినప్పుడు ఘర్షణ తలెత్తింది. నిరసనకారులు పోలీసులపై వాటర్ బాటిళ్ళు, రాళ్ళు రువ్వి, పలు పోలీస్ వాహనాలను ధ్వంసం చేసి నిప్పంటించారు. ఈ తీవ్ర గందరగోళ పరిస్థితిని అదుపు చేయడానికి కపుర్తలా, జలంధర్ రూరల్, హోషియార్‌పూర్ ప్రాంతాల నుంచి భారీగా పోలీస్ బలగాలను క్యాంపస్ వద్దకు రప్పించారు. జలంధర్ రేంజ్ డీఐజీ నవీన్ సింగ్లా మాట్లాడుతూ.. ఈ అత్యాచార వార్తలపై గుర్తుతెలియని వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. దీనిపై విచారణ జరపడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని, సీసీటీవీ ఫుటేజీలు, ఫోరెన్సిక్ ఆధారాల సహాయంతో నిజాలను వెలికితీస్తామని ఆయన మీడియాకు వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా దాదాపు 15 రోజుల క్రితం క్యాంపస్‌లోనే ఆత్మహత్యకు పాల్పడిన తెలంగాణకు చెందిన ఒక విద్యార్థిని మృతి వ్యవహారాన్ని కూడా పరిశీలిస్తామని పోలీసులు ప్రకటించారు. ఆదివారం రాత్రి పోలీసులు క్యాంపస్ లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రస్తుతం అక్కడ 2,000 మందికి పైగా పోలీసులను మోహరింపజేశారు. పరిస్థితులు అదుపులో ఉన్నాయని ఫగ్వారా అదనపు డీజీపీ ఫయాజ్ ఫారూఖీ తెలిపారు. శాంతిభద్రతలను పునరుద్ధరించామని, ఎవరూ ఆందోళన చెందనక్కర్లేదని అన్నారు. క్యాంపస్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగలేదని ఎల్‌పీయూ రిజిస్ట్రార్ మౌనికా గులాటి చెప్పారు. అత్యాచార వార్తలను కొట్టిపారేశారు. ఇలాంటి పుకార్లను నమ్మవద్దని ఆమె కోరారు.

బ్యాంకుల సమ్మె వాయిదా, తెల్లవారేసరికి మారిన సీన్..



నేడు వర్కింగ్ డే

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : గత కొద్ది రోజులుగా సామాన్యులను, వ్యాపార వర్గాలను తీవ్రంగా కలవరపెడుతున్న బ్యాంక్ సమ్మె ముప్పు ఎట్టకేలకు తప్పింది. ఇవాళ్టి నుంచి వరుసగా మూడు రోజుల పాటు బ్యాంకులు మూతపడతాయన్న వార్తలతో ఆందోళన చెందిన కస్టమర్లకు ఇది నిజంగానే ఊరటనిచ్చే వార్త. బ్యాంకు సంఘాలు, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) మధ్య జరిగిన కీలక చర్చలు ఫలించడంతో సమ్మె నిర్ణయాన్ని అధికారికంగా వెనక్కి తీసుకున్నారు. దీంతో నేటి నుంచి బ్యాంకులు యథావిధిగా సేవలను అందించనున్నాయి. సమ్మెకు కేవలం కొన్ని గంటల ముందే ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. సెప్టెంబర్ 27వ తేదీ రాత్రి 9:30 గంటలకు ఐబీఏ ప్రతినిధులు, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీ యూ) నేతలు అత్యవసరంగా సమావేశమయ్యారు. సుదీర్ఘంగా సాగిన ఈ చర్చల్లో ఇరువర్గాల మధ్య కీలక అంశాలపై సానుకూల వాతావరణంలో ఒప్పందం కుదిరింది. బ్యాంకుల లావాదేవీలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో యూనియన్లు తమ సమ్మె అస్త్రాన్ని తాత్కాలికంగా పక్కనపెట్టాయి. బ్యాంక్ ఉద్యోగుల చిరకాల డిమాండ్ అయిన అన్ని శనివారాలను సెలవులుగా ప్రకటించాలనే అంశంపై ఇరువర్గాలు ఒక అంగీకారానికి వచ్చాయి. ప్రస్తుతం రెండో, నాల్గవ శనివారాలు మాత్రమే సెలవులు ఉండగా.. అన్ని శనివారాలను సెలవుదినాలుగా మార్చే ప్రతిపాదనపై చర్చించేందుకు ప్రత్యేకంగా ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీ కస్టమర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ మార్గాలపై కసరత్తు చేసి త్వరలోనే నిర్ణయం వెలువరించనుంది. కేవలం శనివారాల సెలవులే కాకుండా, స్కేల్-4 ఆఫీసర్లకు సంబంధించిన పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) స్కీమ్‌లో మార్పులపై కూడా చర్చలు జరిగాయి. ఉద్యోగుల సంఘాలు లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, ప్రభుత్వంతో చర్చించి తగిన సవరణలు చేసేందుకు అంగీకారం కుదిరింది. అలాగే గతేడాది మార్చి 8 నాటి చర్చల్లో పెండింగ్‌లో ఉన్న ఇతర డిమాండ్లు, జాతీయ పెన్షన్ విధానానికి (ఎన్‌పీఎస్) సంబంధించిన అంశాలను కూడా త్వరలోనే పరిష్కరించనున్నట్లు యూనియన్ నేతలు స్పష్టం చేశారు. ఒకవేళ ఈ సమ్మె కనుక జరిగి ఉంటే సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు బ్యాంకులు పూర్తిగా బంద్ అయ్యేవి. సరిగ్గా అదే సమయంలో సెప్టెంబర్ 30న హాఫ్ ఇయర్లీ క్లోజింగ్స్ ఉండటంతో బ్యాంకింగ్ రంగంపై తీవ్ర ప్రభావం పడేది. ఈ సంక్షోభాన్ని ముందే ఊహించి ఇరువర్గాలు పట్టువీడకపోవడంతో భారీ నష్టం తప్పింది. మొత్తానికి ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై చర్చలకు మార్గం సుగమం కావడంతో, సోమవారం నుంచి అన్ని బ్యాంకుల్లో లావాదేవీలు ఎలాంటి ఆటంకం లేకుండా సాగనున్నాయి.

రైతుల నోట్లో మట్టి కొట్టే కేంద్ర నిర్ణయం

మంత్రి తుమ్మల ఆగ్రహం!

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించిన నిర్ణయంపై తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ఆయిల్ పామ్ రైతుల నోట్లో మట్టి కొట్టినట్టుగా ఉందని ఆయన మండిపడ్డారు. ఒకవైపు దేశంలో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని రాష్ట్రాలను ప్రోత్సహిస్తూ, మరోవైపు విదేశీ పామాయిల్‌పై సుంకం తగ్గించడం కేంద్రం ద్వంద వైఖరికి స్పష్టమైన ఉదాహరణ అని విమర్శించారు. క్రూడ్ పామ్ ఆయిల్‌పై మొత్తం దిగుమతి సుంకం 16.5 శాతం నుంచి 11శాతానికి తగ్గినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. దీనివల్ల దిగుమతి అయ్యే పామాయిల్‌కు పోటీ ప్రయోజనం పెరిగి, దేశీయంగా ఆయిల్ పామ్ గెలల ధరలపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతును ఆయిల్ పామ్ సాగు చేయమని ప్రోత్సహిస్తూ, అదే సమయంలో విదేశీ నూనెకు మార్కెట్‌ను సులభతరం చేయడం ఏ రకమైన రైతు అనుకూల విధానమన్నారు. ఆయిల్ పామ్ సాధారణ సీజనల్ పంట కాదని, రైతు సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టి, నీరు, ఎరువులు, నిర్వహణ ఖర్చులు భరిస్తూ సాగు చేసే దీర్ఘకాలిక పంట అని మంత్రి తుమ్మల వివరించారు. ఇలాంటి పంటకు మార్కెట్ ధరపై స్థిరత్వం కల్పించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని ఆయన అన్నారు. తెలంగాణలో ప్రస్తుతం సుమారు 3.20 లక్షల ఎకరాల్లో 88 వేలకు పైగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, దేశంలో ఈ పంట విస్తీర్ణంలో రాష్ట్రం ముందంజలో ఉందని తెలిపారు. రైతులను ఈ పంట వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీలు, నాట్ల విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్, ప్రాసెసింగ్ యూనిట్లు, రిఫైనరీలు వంటి అనేక చర్యలు చేపడుతోందని గుర్తు చేశారు. కేంద్రం కూడా చీపీజూ-ూూూ పథకం ద్వారా దేశీయ ఉత్పత్తిని పెంచి వంట నూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలని చెబుతోందని, కానీ అమలులో మాత్రం వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. తాజా ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ.25,000 కనీస హామీ ధర కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోందని మంత్రి తుమ్మల చెప్పారు. భారత్ వంట నూనెల అవసరాల్లో సుమారు మూడింట రెండొంతులు దిగుమతులపై ఆధారపడుతున్న నేపథ్యంలో దేశీయ సాగును బలోపేతం చేయడం రైతు సంక్షేమంతో పాటు దేశ ఆహార భద్రతకు కూడా కీలకమని ఆయన నొక్కి చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ అంటే విదేశీ దిగుమతులపై ఆధారపడటం కాదు, దేశీయ రైతు ఉత్పత్తిని పెంచడమేనని స్పష్టం చేశారు.

ఫేస్‌బుక్ లేడీ ట్రాప్ లో దాదాపు రూ.15 కోట్లు పోగొట్టుకున్న హైదరాబాద్ డాక్టర్!

హైదరాబాద్, సెప్టెంబర్ 27 :

హైదరాబాద్ నగరంలో ఒక అవాక్కయ్యే సైబర్ మోసం వెలుగు చూసింది. సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన ఓ అపరిచిత మహిళ మాటలను గుడ్డిగా నమ్మిన ఎర్రగడ్డకు చెందిన 44 ఏళ్ల వైద్యుడు ఏకంగా రూ.14.61 కోట్లను పొగొట్టుకున్నాడు. కొద్దిరోజుల క్రితం బాధితుడికి ఫేస్‌బుక్ మెసెంజర్‌లో మోనిక అనే పేరుతో ఒక మహిళ పరిచయమైంది. కొద్దిరోజులు సాధారణంగా మాట్లాడి ఆ మహిళ అతని నమ్మకాన్ని సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అనతికాలంలోనే భారీ ఆదాయం సంపాదించవచ్చని ఆశచూపింది. ఆమె పంపిన ఒక లింక్ ఆధారంగా సదరు డాక్టర్ ఒక నకిలీ ట్రేడింగ్ వేదికపై ఖాతా తెరవడం జరిగింది. ప్రారంభంలో ఆయన పెట్టిన స్వల్ప పెట్టుబడులకు స్క్రీన్‌పై భారీగా లాభాలు కనిపిస్తుండడంతో, అది నిజమైన ట్రేడింగ్ యాప్ అని నమ్మాడు. విడతల వారీగా కోట్లాది రూపాయలను నేరగాళ్లు సూచించిన వేర్వేరు బ్యాంక్ ఖాతాలకు మళ్లించాడు. ఒకానొక సమయంలో ఆయన యాప్ వాలెట్‌లో సుమారు రూ.34 కోట్ల లాభం ఉన్నట్లు చూపించారు. దాంతో మోసగాళ్ల మాయలో పూర్తిగా చిక్కుకున్న వైద్యుడు, తన చేతిలో ఉన్న సొమ్ముతో పాటు చివరకు తన నివాస గృహాన్ని కూడా విక్రయించి మొత్తం రూ. 14.61 కోట్లను ఇన్వెస్ట్ చేశాడు. అయితే ఆ తర్వాత ఆ సొమ్మును, వచ్చిన లాభాలను తన సొంత బ్యాంక్ ఖాతాలోకి డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా అసలు చిక్కు వచ్చిపడింది. సైబర్ నేరగాళ్లు పన్నులు, టెక్నికల్ ఛార్జీలు అంటూ మరిన్ని కోట్లు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులను ఆశ్రయించాడు. పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, నిధులు మళ్లించిన బ్యాంక్ ఖాతాల ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నారు.అపరిచిత వ్యక్తులు పంపే ట్రేడింగ్, క్రిప్టో లేదా పార్ట్ టైమ్ జాబ్ లింకులను అస్సలు క్లిక్ చేయవద్దని పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930 ఉచిత హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా స్థానిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈవ్ టీజర్లపై షీ టీమ్స్ ఉక్కుపాదం..

హైదరాబాద్, సెప్టెంబర్ 27 :

ఏకంగా 1,530 మంది అరెస్ట్..!

హైదరాబాద్ లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపు 2 లక్షలకు పైగా గణేష్ విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరాయి. హైదరాబాద్ మహా నగరం వ్యాప్తంగా 45 వేల మంది పోలీసులు, 141 కేంద్రాలు, 275 క్రేన్లతో పోలీసు, జీహెచ్ ఎంసీ సహా ఇతర శాఖల అధికారుల సమన్వయంతో నిమజ్జనాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. అయితే గణేష్ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్న నేపథ్యంలో మహిళలు, అమ్మాయిలపై ఈవ్ టీజింగ్ లకు పాల్పడిన ఆకతాయిలను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ షీ టీమ్స్ చేపట్టిన ప్రత్యేక నిఘా ఆపరేషన్ లో భాగంగా రికార్డు స్థాయిలో 1,530 మంది ఈవ్ టీజర్లను అదుపులోకి తీసుకున్నారు. నగరంలో గణేష్ నవరాత్రులు సెప్టెంబర్ 14 నుంచి 23 వరకు జరిగాయి. ఈ రోజుల్లో షీ టీమ్స్ ప్రత్యేకమైన డ్రైవ్ నిర్వహించింది. ఈ ఉత్సవాల్లో ఆకతాయిలపై షీ టీమ్స్ ప్రత్యేకమైన నిఘా పెట్టింది.ఖైరతాబాద్,







బాలాపూర్ తో పాటు రద్దీగా ఉంటే నిమజ్జన మార్గాల్లో మఫ్టీలో పోలీసులు నిఘా ఉంచారు. ఈ మేరకు మహిళలు, యువతులను వేధించిన వారిపై కేసులు నమోదు చేశారు. సెప్టెంబర్ 14 నుంచి 23 వరకు మొత్తం 54 షీ టీమ్స్ బృందాలను మఫ్టీలో ఉంచి పూర్తిగా నిఘా ఉంచారు. ఈ క్రమంలోనే దాదాపు 1,530 మందికి పైగా ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఇక మహిళలు, యువతుల పట్ల కఠినంగా వ్యవహరించిన మరో 48 మందికి కోర్టు ద్వారా శిక్ష పడేటట్లు చేశారు. ఇక దాదాపు 750 మందికి షీ టీమ్స్ తమ కుటుంబ సభ్యుల ఎదుట కౌన్సిలింగ్ నిర్వహించింది. ఈ మేరకు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని షీ టీమ్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.ఇక హైదరాబాద్ లో నిమజ్జన కార్యక్రమాన్ని పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతంగా పూర్తి చేశారు. పోలీస్ కమిషనర్ సీవీ సజ్జనార్ సహా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

అలాగే ఖైరతాబాద్ వినాయక నిమజ్జనానికి దాదాపు 30 లక్షల మంది భక్తులు హాజరయ్యారని పోలీసులు తెలిపారు. అలగే బాలాపూర్ గణేశ్ నిమజ్జనానికి దాదాపు 15 లక్షల మంది హాజరయ్యారని వివరించారు. నిమజ్జనానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చినట్లు తెలిపారు.

సిరిసిల్లపై సీఎం స్పెషల్ ఫోకస్..



30న భారీ సభ
20 వేల మందితో పాదయాత్రకు సన్నాహాలు..
-కాంగ్రెస్ శ్రేణులకు మంత్రుల పిలుపు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

సిరిసిల్ల నియోజకవర్గంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నెల 30న నిర్వహించనున్న సీఎం బహిరంగ సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం సిరిసిల్లలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ప్రశంసించారు. శాసనసభలో ముఖ్యమంత్రి తర్వాత ఆది శ్రీనివాస్ చెప్పిన మాటకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ బాధ్యత అన్నారు. గతంలో కార్యకర్తలపై నమోదైన కక్షపూరిత కేసుల అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ఆది శ్రీనివాస్ కోరిక మేరకు వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

రైతులు, నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తుమ్మల అన్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బకాయిలను తమ ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. నేతన్నల కోసం రుణమాఫీతో పాటు యారన్ డిపో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సిరిసిల్లలో జరిగే సీఎం సభ రాష్ట్ర, దేశ రాజకీయాల్లో చర్చకు వేదిక కావాలని ఆకాంక్షించారు. సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో దాదాపు రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధులను కూడా కేటాయించామని చెప్పారు. కాంగ్రెస్ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తోందని తెలిపారు. ముంపు గ్రామాల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వం సుమారు రూ.370 కోట్ల బకాయిలను మిగిల్చిందని ఆరోపించారు. నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6.94 కోట్ల మేర పని కల్పించిందని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సిరిసిల్లలో సుమారు 20 వేల మందితో పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆది శ్రీనివాస్ వెల్లడించారు. సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సిరిసిల్ల అభివృద్ధి, రైతులు, నేతన్నలు, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి తదితర అంశాలపై సీఎం కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉందని నాయకులు తెలిపారు.ఇక్కడ

వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ ఆజ్మతుల్లా హుస్సేన్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

జిల్లా కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, వాక్స్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి, ధైర్యసాహసాలను కొనియాడారు. సమాజం కోసం ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రజల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పర్యాటక ప్రాంతాలపై యువతకు అవగాహన కల్పించాలి

-కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై యువత, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వేములవాడ మండలం నాంపల్లి గుట్టపై జిల్లా యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం పీటీడీవీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానాన్ని పరిశీలించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాల, కళాశాల విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు, షీల్డులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బుర్రకథ, పిట్టలదొర ప్రదర్శనలు, విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఏదో ఒక రంగంలో ప్రతిభను చాటాలని సూచించారు. పరిసరాల పరిజ్ఞానం, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకునేందుకు దినపత్రికలు చదవడంతోపాటు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం, నాంపల్లి గుట్ట, ఫారెస్ట్ అర్బన్ పార్క్ తదితర పర్యాటక ప్రాంతాలపై యువత విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, విస్తరణకు రూ.250 కోట్లతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.



గుడిచెరువు బండ్ పార్కును సుందరంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ప్రతి దేశ ఆర్థిక వ్యవస్థలో పర్యాటక రంగం కీలక పాత్ర పోషిస్తుందని, పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని అన్నారు .పర్యాటక, చారిత్రక ప్రాంతాలను పరిరక్షించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని యువత, విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, డీఈఓ మొండయ్య, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, బీసీ సంక్షేమ అధికారి సౌజన్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఉపాధి కల్పన అధికారి నిర్మల, డీటీసీపీఓ అన్సార్, తహసీల్దార్ జయంత్, యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

నివాళులర్పించిన అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో చేపట్టగా, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, రజక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

-ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ: ఎస్పీ మహేష్ బి. గితే

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలిగా, సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. బానిసత్వానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి ప్రజల్లో చైతన్యం నింపిన వీరనారి అని కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ శ్రవణ్ యాదవ్, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీని బలహీనపరిచే చర్యలు మానుకోవాలి...



-పదవి ముఖ్యం కాదు.. పార్టీయే ముఖ్యం..
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి

బలగం టీవీ, గంభీరావుపేట :

కాంగ్రెస్ పార్టీలో నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారికి కొందరు నాయకులు అండగా నిలుస్తూ గంభీరావుపేట మండలంలో వర్గపోరును పెంచుతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని దత్త సాయి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తిరుపతి మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్నానని, పీసీసీ అధిష్టానం తనను మండల అధ్యక్షుడిగా నియమించిన మూడు నెలల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. అయితే కొందరు నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.గతంలో మండల అధ్యక్షుడిగా పనిచేసిన హమీద్‌తో పాటు మరికొందరు నాయకులు తనను, తన అనుచరులను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచారని అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి తనకు సమాచారం ఇవ్వకుండా గంభీరావుపేటలో సమాంతర కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్యకర్తల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. బీసీ నాయకుడిగా తాను ఎదగడం ఇష్టం లేకే తనపై కుట్రలు చేస్తున్నారని అన్నారు .

పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించినవారికి, ఇటీవల ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి ప్రాధాన్యం ఇస్తున్నారని,తన కార్యక్రమాలను అడ్డుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి వ్యక్తులను తీసుకువచ్చి గొడవలకు ప్రేరేపిస్తున్నారని అన్నారు. పర్మ హన్మండ్లు కాంగ్రెస్‌లో తన హోదాపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇందిరమ్మ కమిటీల గృహప్రవేశ కార్యక్రమాల్లోనూ ఉద్దేశపూర్వకంగా ఆటంకాలు సృష్టించారని ఆరోపించారు. గతంలో పదవుల కేటాయింపు, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి, అంగన్‌వాడీ పోస్టుల భర్తీ విషయంలోనూ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, దీనిపై ఆధారాలతో పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానన్నారు.

తనను ఎవరైనా బెదిరించినా, ప్రాణహాని తలపెట్టినా వెనక్కి తగ్గేది లేదని, గంభీరావుపేట మండలంలో జరుగుతున్న పరిణామాలపై త్వరలోనే పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు, అవసరమైతే ఏఐసీసీ అధిష్టానానికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు వర్గపోరును పక్కనపెట్టి కార్యకర్తల ఐక్యత, పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని కోరారు.ఇక్కడ

మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్ఉ,పాధ్యక్షులు ఎర్ర కిషన్ గౌడ్, జోగు సురేష్,నరల్ సెక్రెటరీ తాహీర్ భాయ్, జిల్లా కో కన్వీనర్ రాజ్ వీర్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి గాండ్ల బాలలక్ష్మి,మండల ప్రధాన కార్యదర్శ లు గుర్రం రాజా గౌడ్యే,త్వర్ రేణుక,ఈసీ మెంబెర్, మోగులాల రామచంద్ర గౌడ్రా,నాయకులు నరేష్ వర్మ,

అంజిరెడ్డి,నిషాత్, వెంకటస్వామి, అల్లపు రమేష్, బాలా గౌడ్, లక్ష్మినారాయణ,ఎర్ర నర్సయ్య,బోయినగారి లింగం, రాజ్ కుమార్, శివంది శీను, దేశెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, టీఆర్ఎస్ నాయకులతో పాటు రజక సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ నాటి నిజాం, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరవనిత అని కొనియాడారు. తన పొలంలోని వరి పంటను జాగీర్దారులు అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించినప్పుడు రోకలిబండతో వారిని ఎదిరించి అడ్డుకున్న ధైర్యసాహసాలకు ఐలమ్మ పోరాటం ప్రతీకగా నిలిచిందన్నారు.

చాకలి ఐలమ్మ సేవలను ప్రభుత్వం గుర్తించి గౌరవిస్తోందని నాయకులు పేర్కొన్నారు. మహిళా హక్కుల కమిషన్‌లో ఐలమ్మ కుటుంబానికి చెందిన వారిని సభ్యురాలిగా అవకాశం కల్పించడం, మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి చర్యలు ఆమె పోరాటానికి లభిస్తున్న గుర్తింపుగా పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు ప్రజల హక్కుల కోసం పోరాడిన కొమరం భీమ్, దొడ్డి కొమురయ్య, సర్వాయి పాపన్నగౌడ్ వంటి మహనీయుల సేవలను కూడా ప్రభుత్వం గుర్తించి గౌరవిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సీఐ ఓ. వెంకటేష్, సర్పంచులు ఎలగందుల నర్సయ్య, అందె సుభాష్, నాయకులు గుండాటి రాంరెడ్డి, చీటీ లక్ష్మణరావు, సద్దిలక్ష్మారెడ్డి, ఖానాపురం లక్ష్మణ్, బుగ్గ కృష్ణమూర్తి, వెంకట్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకుడు మజీద్, రజక సంఘం నాయకులు దొమ్మాటి దేవయ్య, కంచర్ల పరుశరాములు, రాములు, అంజయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం





సమిష్టి కృషితో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పూర్తి

బలగం టీవీ, సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా పూర్తయింది. సమిష్టి కృషితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.

ఈ నెల 14న ప్రారంభమైన గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా 2,200కు పైగా గణేశ్ మండపాల నుంచి విగ్రహాలను శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేసినట్లు ఎస్పీ తెలిపారు. శోభాయాత్రలు, నిమజ్జన ప్రాంతాలను సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించినట్లు చెప్పారు. పోలీసులతో పాటు రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, ఆరోగ్యశాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదన్నారు. 11 రోజులపాటు 24 గంటలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బంది కృషితోనే గణేశ్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించగలిగామని ఎస్పీ పేర్కొన్నారు. విధుల్లో కష్టపడి పనిచేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన జిల్లా ప్రజలకు, గణేశ్ మండపాల నిర్వాహకులకు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న పండుగలను ఇదే స్ఫూర్తితో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.





పబ్లిక్ మీటింగ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ఈనెల 30వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వద్ద రగుడు బైపాస్ రోడ్ వద్ద పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్న పబ్లిక్ మీటింగ్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె తో కలిసి శనివారం పరిశీలించారు. మీటింగ్ కోసం స్థలాన్ని చదును చేసే పనులు కొనసాగుతుండగా, పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించారు. వివిధ వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.

పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీష్మానాయక్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏసీబీకి చిక్కిన మెట్‌పల్లి చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్

బలగం టీవీ, మెట్‌పల్లి

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీవో) దరోజు పద్మ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మండల కేంద్రంలోని 21 అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల సందర్భంగా తనకు అనుకూలంగా నివేదికలు తయారు చేయాలని, లేకపోతే వ్యతిరేకంగా నివేదికలు ఇస్తానని బెదిరిస్తూ ఆమె లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం నుంచి నెలకు వెయ్యి రూపాయల చొప్పున మూడు నెలల కాలానికి గాను మొత్తం రూ.63 వేలు ఇవ్వాలని సీడీపీవో పద్మ డిమాండ్ చేశారు. బాధితులు ఈ విషయమై ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పక్కా వ్యూహం ప్రకారం శనివారం రూ.63 వేల లంచం డబ్బులు తీసుకుంటుండగా అధికారులు ఆమెపై దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన ఏసీబీ బృందం ఆమెను అరెస్టు చేసి కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచింది.

దళిత యువకుడిపై దాడి

కారులో తీసుకెళ్లి దుస్తులు విప్పి విచక్షణారహితంగా కొట్టిన ముగ్గురు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు

బలగం టీవీ, సుల్తానాబాద్

సుల్తానాబాద్ పట్టణంలో దళిత యువకుడిని కారులో బలవంతంగా తీసుకెళ్లి దుస్తులు విప్పి విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన కలకలం రేపింది. బాధితుడి ఫిర్యాదుతో దాడికి పాల్పడిన ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డుకు చెందిన చిలుక ఉదయ్ గత పదేళ్లుగా పట్టణంలోని నందిని హోల్‌సేల్ కిరాణా దుకాణంలో కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విధుల్లో ఉన్న ఉదయ్‌ను పట్టణానికి చెందిన మునిగంటి రంజిత్, మునిగంటి శ్రావణ్, గోపిడి ఓంకార్ కలిసి బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు.

అనంతరం సుల్తానాబాద్ పరిధిలోని నీరుకుల్ల గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఉదయ్ దుస్తులు విప్పి నగ్నంగా ఉంచి కర్రలు, రాళ్లతో తీవ్రంగా దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో ఉదయ్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న అతని సోదరుడు చిలుక శ్రీకాంత్ వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించిన పోలీసులు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా పథకాల అమలు

-మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రగుడు బై పాస్ రోడ్ సమీపంలో నిర్వహించనున్న పబ్లిక్ మీటింగ్ స్థలాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మీటింగ్ స్థలాన్ని పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. పబ్లిక్ మీటింగ్, వాహనాల పార్కింగ్, ఇతర ఏర్పాట్లపై ఆరా తీశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ..

ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. 33 నెలల ప్రజా ప్రభుత్వ పాలనలో అన్ని



వర్గాల సంక్షేమ లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. రైతులు, నేతన్నలు, అన్ని వర్గాల ప్రజలు లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పాలన అందిస్తుందని తెలిపారు. జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాల శంకుస్థాపన ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను ప్రజలు తరలివచ్చి వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి గారు ఈ నెల 30వ తేదీన కరీంనగర్ జిల్లాలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్‌ను ప్రారంభించడంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు.

అనంతరం సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, భారీ బహిరంగ సభలో పాల్గొంటారని, ముఖ్యమంత్రి ఈ సందర్భంగా 33 నెలల ప్రజాపాలనలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారని తెలిపారు.

అదే సమయంలో సామాజిక న్యాయం, ప్రజాస్వామిక ఆకాంక్షలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా మాట్లాడనున్నారన్నారు. 33 నెలల ప్రజా ప్రభుత్వం సంక్షేమ రంగంలోనే కాకుండా వ్యవసాయం, సాంకేతిక రంగం, మౌలిక వసతులు, సాగునీరు, విద్య, ఉపాధి తదితర అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా అనేక చర్యలు చేపడుతుందని, సమీకృత అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రత్యేకంగా సిరిసిల్ల నేత కార్మికుల సమస్యలపై సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు . ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో కూడా నేతన్నలకు అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. చలో సిరిసిల్ల ద్వారా ప్రజా పాలన విజయాన్ని చాటుదామని పేర్కొన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..



-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఈ నెల 30న ముఖల్‌ంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు శ్రీధర్‌బాబు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 30న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్డులోని మైదానంలో బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ అధికారులు ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, భద్రతా చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.జిల్లా సమగ్ర అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజలు చిరకాలం గుర్తుంచుకునేలా సేవలు అందించాలని, ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు.

అంతకుముందు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణపై చర్యలు చేపట్టాలి


బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ జీవన్‌రెడ్డి

బలగం టీవీ, రాయికల్

చెరువులు, కుంటల ఆక్రమణలపై వెంటనే చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాయికల్ మండలం ఇటిక్యాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువులు, కుంటలను శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో గుర్తించి బఫర్‌జోన్‌తో హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఆ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. ఈ కార్యక్రమాన్ని నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సమన్వయంతో చేపట్టాలని కోరారు.

జగిత్యాల మండలంలోని తిమ్మాపూర్, మోతే, కండ్లపల్లి చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, ఈ విషయాన్ని కలెక్టర్ నిర్వహించే ప్రజావాణిలో తన దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. భూ ఆక్రమణదారులు గుట్టలను తవ్వి మట్టిని చెరువుల్లో పోస్తుండటంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోందని అన్నారు. దీనివల్ల మత్స్యకారులకు చేపల పెంపకంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రైతులకు భూగర్భ జలాలు తగ్గి సాగునీటి సమస్య ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఎఫ్‌టీఎల్ స్థాయిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

చెరువుల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమంలోనూ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గతేడాది 25 శాతం చెరువుల్లో కూడా చేప పిల్లలు వదలలేదని ఆరోపించారు. ఈ ఏడాది ఇప్పటివరకు టెండర్ ప్రక్రియ పూర్తికాలేదని, సెప్టెంబర్, అక్టోబర్‌లో చేప పిల్లలను వదిలితే అవి ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. మత్స్యకారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు.



అనంతరం మండలంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, నాయకులు మల్లేష్‌యాదవ్, రాజిరెడ్డి, మహేశ్వరరావు, మైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

2026లోగా భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం పూర్తి చేయాలి

బలగం టీవీ, వాషింగ్టన్:

భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని 2026 చివరి నాటికి పూర్తి చేయాలని యూఎస్–ఇండియా బిజినెస్ కౌన్సిల్ (యూఎస్ఐబీసీ) కోరింది. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు పరస్పర వాణిజ్య ఒప్పందాన్ని ఈ ఏడాదిలోనే ఖరారు చేయాలని యూఎస్ఐబీసీ అధ్యక్షుడు అతుల్ కేశప్ సూచించారు.

గత రెండు దశాబ్దాల్లో భారత్, అమెరికా చారిత్రాత్మక మైలురాళ్లను సాధించాయని, ఈ ఏడాది చివరిలోగా పరస్పర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడం వాటిలో అత్యంత కీలకమైన విజయంగా నిలుస్తుందని కేశప్ పేర్కొన్నారు. వాణిజ్య అడ్డంకులు, సుంకాలను తగ్గించేందుకు ప్రస్తుత అవకాశాన్ని ఇరు దేశాలు వినియోగించుకోవాలని కౌన్సిల్ సూచించింది.

భారత్, అమెరికా ఫిబ్రవరిలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తొలి దశకు సంబంధించిన రూపురేఖలను ఖరారు చేశాయి. అయితే అమెరికా సుంకాల విధానంలో మార్పులు రావడంతో చర్చలు మరింత ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్‌పై అమెరికా విధించిన 10 శాతం సుంకాలు, పారిశ్రామిక అధిక ఉత్పత్తి సామర్థ్యం, సబ్సిడీలపై సెక్షన్ 301 దర్యాప్తు అవకాశాలు చర్చల్లో అనిశ్చితిని పెంచాయి. రష్యాపై ఆంక్షలకు సంబంధించిన చట్టాన్ని అమెరికా కాంగ్రెస్ ఆమోదించడం కూడా ఒప్పందం త్వరగా పూర్తయ్యే అంశంపై ప్రభావం చూపే అవకాశముంది.

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో అమెరికాలోని మిల్వాకీలో జరిగే జీ20 వాణిజ్య మంత్రుల సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించి వాణిజ్య ఒప్పందంపై చర్చించే అవకాశం ఉంది.

పరస్పర వాణిజ్యాన్ని విస్తరించడం ద్వారా వాణిజ్య అడ్డంకులు తగ్గి, వినియోగదారుల మార్కెట్లు విస్తరించడంతో పాటు తయారీ రంగానికి, కృత్రిమ మేధా తదితర రంగాల్లో సహకారానికి ఊతం లభిస్తుందని కేశప్ పేర్కొన్నారు.

ఇరాన్ శాంతి ప్రణాళికను తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు



ట్రూత్ సోషల్ వేదికగా కొత్త మ్యాప్ షేర్ చేసిన ట్రంప్; మళ్లీ దాడులు చేస్తామని హెచ్చరిక

బలగం టీవీ, వాషింగ్టన్:

కీలకమైన అంతర్జాతీయ సముద్ర రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధి (Strait of Hormuz) వివాదంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. జలసంధి పునరుద్ధరణ మరియు అణు చర్చల పునఃప్రారంభంపై ఇరాన్ ప్రతిపాదించిన ఏడు రోజుల షరతులతో కూడిన సీజ్‌ఫైర్ ప్రణాళికను ఆయన తీవ్రంగా తిరస్కరించారు. అంతేకాకుండా, ఆ జలసంధిని 'ట్రంప్ స్ట్రెయిట్' (Trump Strait) గా పేర్కొంటూ రూపొందించిన మ్యాప్‌ను తన 'ట్రూత్ సోషల్' వేదికగా పంచుకుని ఆధిపత్యాన్ని ప్రదర్శించారు.

ఈ జలసంధిని అమెరికా భూభాగంగా (US Territory) ప్రకటించే ఆలోచన తనకు ఉందని ట్రంప్ గతంలోనే వ్యాఖ్యానించారు. అమెరికా నావికా దిగ్బంధం ద్వారా జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందన్న ఆయన, ఇరాన్ ఎప్పటికీ అణు బాంబును తయారు చేయలేదని స్పష్టం చేశారు. ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే మళ్లీ వైమానిక దాడులు ప్రారంభించడం ఖాయమని హెచ్చరించారు. అయితే ట్రంప్ చేసిన ఈ సోషల్ మీడియా పోస్ట్ వల్ల ఆ ప్రాంత అధికారిక పేరు లేదా హోదాలో ఎలాంటి మార్పులు ఉండవని విశ్లేషకులు స్పష్టం చేశారు.

ఇంతకుముందు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి మాట్లాడుతూ.. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధం ఎత్తివేసి, చమురు ఎగుమతులపై ఆంక్షలు తొలగించి, లెబనాన్‌ను కూడా కలిపేలా కాల్పుల విరమణకు అంగీకరిస్తే 7 రోజుల్లో హోర్ముజ్ ద్వారా నౌకాయానాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించారు. అయితే ఇరాన్ షరతులను ట్రంప్ తోసిపుచ్చడంతో ప్రపంచ ఇంధన మార్కెట్లో సంక్షోభం మరింత ముదిరింది. రాబోయే నవంబర్ మధ్యంతర ఎన్నికల వేళ ఈ పరిణామాలు ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా తీవ్ర సవాలుగా మారాయి.

క్వాంగో ప్రావిన్స్‌లో కుప్పకూలిన సైనిక విమానం

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మిలిటరీ

తిరుగుబాటుదారులతో పోరు జరుగుతున్న వేళ విషాదం; మృతుల్లో మిలిటరీ కోర్టు అధిపతి, ఆడిటర్ జనరల్

బలగం టీవీ, హైదరాబాద్



డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ)లో శుక్రవారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. దేశంలోని క్వాంగో ప్రావిన్స్ పరిధిలోని కెంజ్ ప్రాంతంలో సైనిక విమానం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు ఉన్నత స్థాయి సీనియర్ సైనికాధికారులు సహా మొత్తం 14 మంది దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటనను కాంగో సాయుధ దళాల ప్రతినిధి మేజర్ జనరల్ ఎఫోమి ఎకెంగే ధృవీకరించారు.

ఈ ప్రమాదంలో మిలిటరీ కోర్టు అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ముటోంబో కటలాయి టియెండే, సాయుధ దళాల ఆడిటర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ బకుమి లికులియా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు మరో 12 మంది సైనిక ప్రతినిధులు, విమాన సిబ్బంది కూడా దుర్మరణం పాలయ్యారు. రువాండా మద్దతు ఉన్న ఎం23 (M23)తో పాటు పలు ఇతర తిరుగుబాటు గ్రూపులతో కాంగో తీవ్రస్థాయిలో పోరాడుతున్న కీలక సమయంలో, ఉన్నతాధికారులను కోల్పోవడం కాంగో సైన్యానికి భారీ విఘాతంగా మారింది. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు సమాచారం.

పాక్‌కు భారత్ దీటైన సమాధానం

కశ్మీర్, ఉగ్రవాదంపై యూఎన్‌లో పెటల్ గహ్లోత్ తీవ్ర వ్యాఖ్యలు

బలగం టీవీ, హైదరాబాద్

ఐక్యరాజ్యసమితి సాధారణ సభ వేదికగా పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ వ్యాఖ్యలకు భారత్ దీటుగా బదులిచ్చింది. భారత్ తరఫున ఐరాసలో హక్కు వినియోగించుకుని మాట్లాడిన శాశ్వత మిషన్ ప్రథమ కార్యదర్శి పెటల్ గహ్లోత్.. కశ్మీర్, సరిహద్దు ఉగ్రవాదం, మైనారిటీల హక్కుల అంశాలపై పాకిస్థాన్ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. పాకిస్థాన్ నుంచి కొనసాగుతున్న సరిహద్దు ఉగ్రవాదానికి పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు.

పాకిస్థాన్ ప్రతినిధి చేసిన వ్యాఖ్యలు విచిత్రంగా ఉన్నాయని గహ్లోత్ పేర్కొన్నారు. 9/11 ఉగ్రదాడుల 25వ వార్షికోత్సవం జరిగిన రెండు వారాలకే ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హమన్నారు. 9/11 దాడుల సూత్రధారి ఒసామా బిన్ లాడెన్ పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌లో ఆ దేశ సైనిక అకాడమీకి సమీపంలో ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, మత సహనం గురించి పాకిస్థాన్ మాట్లాడటం దాని వైఖరికి విరుద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు.

కశ్మీర్‌పై పాక్ వ్యాఖ్యలకు కౌంటర్

జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని గహ్లోత్ స్పష్టం చేశారు. కశ్మీర్ గురించి మాట్లాడాలనుకుంటే పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న జమ్మూకశ్మీర్‌లోని ప్రజల పరిస్థితిపై కూడా చర్చించాలని సూచించారు. రావలకోట్ ప్రజలు ఎదుర్కొంటున్న హింస, హక్కుల సమస్యలను ప్రపంచం దృష్టికి తీసుకురావాలని అన్నారు. పాకిస్థాన్ తన ఆధీనంలోని ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక హక్కులు కల్పించడంపై సమాధానం



చెప్పాలని పేర్కొన్నారు.సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ తన ఆత్మరక్షణ హక్కును కొనసాగిస్తుందని గహ్లోత్ తెలిపారు. ఉగ్రవాదానికి పాల్పడితే పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఉగ్రవాదంపై పాకిస్థాన్ చెబుతున్న మాటల కంటే ఆ దేశ చర్యలను అంతర్జాతీయ సమాజం పరిశీలించాలని సూచించారు.

మైనారిటీల పరిస్థితి, మతపరమైన అసహనం, దైవదూషణ చట్టాల అమలుపైనా గహ్లోత్ ప్రశ్నలు లేవనెత్తారు. పాకిస్థాన్ మాటలతో వాస్తవాలను కప్పిపుచ్చలేదని వ్యాఖ్యానించారు.

అంతకుముందు ఐరాస సాధారణ సభలో ప్రసంగించిన షెహ్‌బాజ్ షరీఫ్ జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడంతో పాటు 2025లో భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన ఘర్షణలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యాన్ని ప్రశంసించారు. సింధు జలాల అంశంపైనా భారత్‌ను హెచ్చరిస్తూ వ్యాఖ్యలు చేశారు.

కబడ్డీలో తిరుగులేని భారత్..

ఫైనల్స్‌లో ఇరాన్‌పై పసిడి విజయాలు!
మహిళల జట్టుకు 37-34తో, పురుషుల జట్టుకు 40-34తో అద్భుత గెలుపు; కబడ్డీలో భారత్‌దే మళ్లీ రాజ్యాంగం

బలగం టీవీ, నగోయా

జపాన్‌లో జరుగుతున్న 20వ ఆసియా క్రీడలలో భారత కబడ్డీ జట్లు తమ శ్రేష్ఠమైన ఆధిపత్యాన్ని పునరావృతం చేస్తూ రికార్డు స్థాయిలో రెండు స్వర్ణ పతకాలను (డబుల్ గోల్డ్) కైవసం చేసుకున్నాయి. శనివారం జరిగిన మహిళల, పురుషుల ఫైనల్ సమరాల్లో రెండింటిలోనూ చిరకాల ప్రత్యర్థి ఇరాన్‌పై భారత్ వీరోచిత విజయాలు సాధించి పసిడి పతకాలను ముద్దాడింది.

మహిళల ఫైనల్: ఇరాన్‌పై 37-34తో పోరాడి గెలిచిన భారత మహిళలు

ఉదయం జరిగిన మహిళల ఫైనల్లో భారత జట్టు 37-34 తేడాతో ఇరాన్‌ను ఓడించి ఆసియా క్రీడల్లో వరుసగా నాలుగోసారి స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. మ్యాచ్ తొలి అర్ధభాగంలో భారత్ 22-16తో స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అయితే రెండో అర్ధభాగంలో తీవ్రంగా శ్రమించిన ఇరాన్ జట్టు ఒకానొక దశలో 27-26తో ఆధిక్యాన్ని కేవలం ఒక్క పాయింట్‌కు తగ్గించి భారత్‌కు గట్టి సవాలు విసిరింది. ఆ క్లిష్ట సమయంలో సంజు దేవి సాధించిన 'సూపర్ రైడ్' మ్యాచ్‌లో కీలక మలుపుగా మారింది. అనంతరం కెప్టెన్ పుష్ప రాణా, పూజలు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మరో ఆలౌట్‌కు సహకరించడంతో భారత్ విజయం ఖాయమైంది. మొత్తంగా భారత్ 26 అవుట్ పాయింట్లు సాధించగా, ఇరాన్ 21 పాయింట్లు పొందింది.






పురుషుల ఫైనల్: ఉత్కంఠ పోరులో 40-34తో ఇరాన్‌పై భారత్ ఘనవిజయం

సాయంత్రం జరిగిన పురుషుల ఫైనల్ పోరులో సునీల్ కుమార్ సారథ్యంలోని భారత పురుషుల జట్టు 40-34 తేడాతో ఇరాన్‌ను చిత్తు చేసి ఆసియా గేమ్స్ చరిత్రలో 9వ స్వర్ణ పతకాన్ని సాధించింది. మ్యాచ్ తొలి అర్ధభాగంలో ఇరాన్ డిఫెండర్లు వరుస టాకిల్స్‌తో విజృంభించడంతో భారత్ కేవలం ఇద్దరు ఆటగాళ్లకే పరిమితమై ఆలౌట్ ప్రమాదంలో పడింది. ఆ దశలో జైదీప్ దహీయా చేసిన అద్భుతమైన 'సూపర్ టాకిల్' ఇరాన్ స్టార్ ప్లేయర్ షద్లూను అవుట్ చేసి భారత్‌ను నిలబెట్టింది. అర్జున్ దేశ్వాల్ తుఫాన్ రైడింగ్‌తో భారత్ ఆధిక్యంలోకి వెళ్లినా, తొలి సగభాగం ముగిసేసరికి ఇరాన్ 18-17తో నిలిచింది.

సెకండాఫ్‌లో అస్లామ్ ఇనామ్‌దార్ చేసిన పవర్ ఫుల్ 'సూపర్ రైడ్' మ్యాచ్‌నే మలుపు తిప్పింది. ఈ ఊపుతో భారత ఆటగాళ్లు ఇరాన్‌ను ఆలౌట్ చేసి 29-24 ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. డిఫెన్స్‌లో సుమిత్ మైండ్-బ్లోయింగ్ టాకిల్స్‌తో రక్షించగా, చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత్ 40-34తో విజేతగా నిలిచి ఆసియాడ్‌లో భారత కబడ్డీ జెండాను రెపరెపలాడించింది.



పురుషులు, మహిళల సింగిల్స్ ఫైనల్లో అభయ్ సింగ్, అనాహత్ సింగ్..

స్వర్ణాలపై భారత కన్ను!
పాక్ ప్లేయర్‌పై అభయ్ ఏకపక్ష విజయం; రెండు గేమ్‌లు ఓడి అద్భుత పునరాగమనంతో గెలిచిన అనాహత్

బలగం టీవీ, నగోయా

జపాన్‌లో జరుగుతున్న 20వ ఆసియా క్రీడల్లో భారత స్క్వాష్ క్రీడాకారులు సంచలన ప్రదర్శనతో చరిత్ర సృష్టించారు. శనివారం జరిగిన పురుషుల, మహిళల సింగిల్స్ సెమీఫైనల్ పోరులో అభయ్ సింగ్, అనాహత్ సింగ్ అద్భుత విజయాలు సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లారు. దీంతో భారత్‌కు స్క్వాష్ సింగిల్స్‌లో కనీసం రెండు రజత పతకాలు ఖాయమవ్వగా, రెండు స్వర్ణ పతకాలు గెలిచే సువర్ణావకాశం లభించింది.

పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ఆసియా ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్ అభయ్ సింగ్ పాకిస్థాన్‌కు చెందిన ముహమ్మద్ ఇర్ఫాన్‌పై 11-3, 12-10, 11-6 తేడాతో వరుస గేమ్‌లలో ఘనవిజయం సాధించాడు. కేవలం 30 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో అభయ్ ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. సౌరవ్ ఘోషాల్ తర్వాత ఆసియా గేమ్స్ స్క్వాష్ సింగిల్స్ ఫైనల్ చేరిన రెండో భారతీయ పురుష క్రీడాకారుడిగా అభయ్ రికార్డు పుటలకెక్కాడు.

మరోవైపు మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో 18 ఏళ్ల భారత యువ సంచలనం అనాహత్ సింగ్ ఊహించని రీతిలో పుంజుకుని అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ప్రపంచ 6వ ర్యాంకర్, జపాన్ స్టార్ ప్లేయర్ సతోమి వతనాబేతో జరిగిన పోరులో మొదటి రెండు గేమ్‌లను (9-11, 11-13) కోల్పోయిన అనాహత్, తీవ్ర ఒత్తిడిని జయించి తదుపరి మూడు గేమ్‌లను (12-10, 11-6, 11-3) వరుసగా గెలుచుకుంది. ఈ అపూర్వ పునరాగమనంతో వతనాబేపై విజయం సాధించి ఫైనల్లోకి అడుగుపెట్టింది. కాగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇప్పటికే జోష్నా చిన్నప్ప - వేలవన్ సెంథిల్‌కుమార్ జోడీ కాంస్యం సాధించగా, ఇప్పుడు సింగిల్స్‌లోనూ రెండు పతకాలు ఖాయం కావడంతో భారత స్క్వాష్ బృందం ఆనందం వ్యక్తం చేస్తోంది.



మహిళల 400 మీటర్ల ఫైనల్లో ప్రాచీ చౌదరికి కాంస్య పతకం!

53.21 సెకన్లతో మూడో స్థానంలో నిలిచిన భారత అథ్లెట్; స్వర్ణం గెలుచుకున్న బహ్రెయిన్ క్రీడాకారిణి సాల్వా నాసర్

బలగం టీవీ, నగోయా

జపాన్ వేదికగా జరుగుతున్న 20వ ఆసియా క్రీడలలో భారత అథ్లెట్లు తమ పతకాల వేటను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. శనివారం జరిగిన మహిళల 400 మీటర్ల రన్నింగ్ ఫైనల్ పోరులో భారత అథ్లెట్ ప్రాచీ చౌదరి అద్భుత ప్రదర్శన చేసి కాంస్య పతకాన్ని (బ్రాంజ్ మెడల్) సొంతం చేసుకుంది.

తీవ్ర పోటీ నడుమ సాగిన ఈ రేసులో ప్రాచీ నిర్దేశిత రేసు దూరాన్ని 53.21 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచి పతకాన్ని కైవసం చేసుకుంది. ఇక ఈ విభాగంలో బహ్రెయిన్‌కు చెందిన సాల్వా నాసర్ 49.20 సెకన్ల టైమింగ్‌తో నయా ఆసియాడ్ రికార్డును నెలకొల్పి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, ఇరాన్‌కు చెందిన జహ్రా జరీ మనుజన్ (52.38 సెకన్లు) రజత పతకాన్ని గెలుచుకుంది. ఈ ఫైనల్ రేసులో బరిలోకి దిగిన మరో భారత అథ్లెట్ కిరణ్ పహల్ 53.41 సెకన్ల టైమింగ్‌తో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది.

వర్షం కారణంగా జపాన్ - నేపాల్ మ్యాచ్ రద్దు..

క్వార్టర్ ఫైనల్లో అఫ్గానిస్థాన్‌తో భారత్ పోరు!
క్వార్టర్స్‌కు అర్హత సాధించిన అఫ్గాన్!
రేపు కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో భారత్ - అఫ్గానిస్థాన్ మ్యాచ్
శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలో డిఫెండింగ్ ఛాంపియన్ వేట

బలగం టీవీ, నగోయా

జపాన్‌లో జరుగుతున్న 20వ ఆసియా క్రీడలలో భారత పురుషుల క్రికెట్ జట్టు క్వార్టర్ ఫైనల్ ప్రత్యర్థి ఖరారైంది. శనివారం జపాన్, నేపాల్ జట్ల మధ్య జరగాల్సిన గ్రూప్-ఏ ఆఖరి లీగ్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో అఫ్గానిస్థాన్ క్వార్టర్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. మెరుగైన ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్ ఆడుతుండగా, ఇప్పుడు భారత్ తన తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్‌తో తలపడనుంది.

వర్షం అంతరాయం కలిగించడంతో 15 ఓవర్లకు కుదించిన లీగ్ మ్యాచ్‌లో నేపాల్ మొదట బ్యాటింగ్ చేసి 4 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. ఆ తర్వాత నేపాల్ ఇన్నింగ్స్ పూర్తయ్యాక మళ్లీ వర్షం తీవ్రమవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేసి ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. దీంతో ఆతిథ్య జపాన్ టోర్నీ నుంచి నిష్క్రమించగా, గ్రూప్-ఏ నుంచి నేపాల్, అఫ్గానిస్థాన్ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచిన అఫ్గానిస్థాన్.. సెప్టెంబర్ 28న జరగనున్న క్వార్టర్ ఫైనల్లో భారత్‌తో పోటీపడనుంది.



కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో భారత కాలమానం ప్రకారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, సోనీ లివ్ యాప్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. శ్రేయాస్ అయ్యర్ నాయకత్వంలోని భారత జట్టులో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు. ఈ ఆసియాడ్‌లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది.

వెస్టిండీస్ పోరుకు భారత్ సిద్ధం



నేడే తొలి వన్డే
ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా ప్రయోగాలు..
సిరీస్ విజయంపై కరీబియన్ల గురి

బలగం టీవీ, హైదరాబాద్

వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా భారత్, వెస్టిండీస్ మూడు వన్డేల సిరీస్‌లో తలపడనున్నాయి. ఈ నెల 27న తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియంలో తొలి వన్డే జరగనుంది. ప్రపంచకప్‌కు ముందు రిజర్వ్ ఆటగాళ్లను పరీక్షించేందుకు భారత్‌కు ఈ సిరీస్ అవకాశం కాగా.. ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశం కోల్పోయిన వెస్టిండీస్‌కు క్వాలిఫయర్ పోరుకు ముందు కీలక సన్నాహకంగా మారింది.

వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ కంటే పది స్థానాలు వెనుక ఉన్న వెస్టిండీస్.. స్వదేశంలో దశాబ్దాలుగా భారత్‌పై ద్వైపాక్షిక సిరీస్ విజయం కోసం ఎదురుచూస్తోంది. 2006లో చివరిసారిగా భారత్‌పై వన్డే సిరీస్ గెలిచిన వెస్టిండీస్.. ఆ తర్వాత వరుసగా 13 సిరీస్‌ల్లో ఓడిపోయింది. భారత్‌లో చివరిసారిగా సిరీస్ గెలిచింది 2002లో. ఈ నేపథ్యంలో భారత గడ్డపై సత్తా చాటాలని కరీబియన్ జట్టు భావిస్తోంది.

కోహ్లీ, రోహిత్‌పై అందరి దృష్టి

భారత జట్టులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలపైనే ప్రధానంగా దృష్టి నెలకొంది. తొలి వన్డేకు రెండు రోజుల ముందు ఇద్దరూ నెట్స్‌లో సుదీర్ఘంగా బ్యాటింగ్ సాధన చేశారు. వచ్చే ఏడాది ప్రపంచకప్ తనకు చివరిదిగా ఉండొచ్చన్న ఉద్దేశంతో కోహ్లీ తనలో ప్రేరణ ఉందని ఇటీవల పేర్కొన్నాడు. రోహిత్ భవిష్యత్తుపై కొంతకాలంగా సాగిన చర్చ కూడా ప్రస్తుతం తెరమరుగైంది.

తొలి వన్డేలో శుభ్‌మన్ గిల్ ఆడటం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ప్రాక్టీస్‌లో మహ్మద్ సిరాజ్ వేసిన బంతి గిల్ మోచేతికి తగిలినా.. అతడు ఫిట్‌గా ఉన్నాడని బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ స్పష్టం చేశారు. గిల్‌కు ఏదైనా అనూహ్య పరిస్థితి ఎదురైతే యశస్వి జైస్వాల్ ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉన్నాడు.

నాలుగో స్థానంపై ఆసక్తి

శ్రేయస్ అయ్యర్ లేకపోవడంతో నాలుగో స్థానంపై ఆసక్తి నెలకొంది. రుతురాజ్ గైక్వాడ్ ఆ స్థానంలో ఆడే అవకాశాలు ఉన్నాయి. పేస్ విభాగంలో ముగ్గురు ప్రధాన బౌలర్లతో పాటు నితీశ్ కుమార్ రెడ్డిని కొనసాగించే అవకాశం కనిపిస్తోంది. ప్రాక్టీస్‌లో లభించిన బౌన్స్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టు కూర్పుపై నిర్ణయం తీసుకోనున్నారు.

భారత్ అంచనా తుది జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, గుర్నూర్ బ్రార్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్.

ఆశలన్నీ షై హోప్‌పైనే

వెస్టిండీస్ జట్టుకు కెప్టెన్ షై హోప్ ప్రధాన బ్యాటింగ్ బలంగా ఉన్నాడు. అనుభవజ్ఞులతో పాటు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పిస్తూ జట్టు కూర్పును సిద్ధం చేశారు. దాదాపు ఏడాది తర్వాత జ్యువెల్ ఆండ్రూ తిరిగి జట్టులోకి వచ్చాడు. అమీర్ జాంగూ, కైల్ మేయర్స్ స్థానంలో ఎంపికైన ఆటగాళ్లతో పాటు స్పిన్ విభాగంలో గుడాకేశ్ మోటీ, రోస్టన్ చేజ్‌లపై ఆశలు ఉన్నాయి.

వెస్టిండీస్ అంచనా తుది జట్టు: జాన్ క్యాంప్‌బెల్, జస్టిన్ గ్రీవ్స్/జ్యువెల్ ఆండ్రూ, కీసీ కార్టీ, షై హోప్ (కెప్టెన్, వికెట్ కీపర్), అమీర్ జాంగూ, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డ్, గుడాకేశ్ మోటీ, అల్జారీ జోసెఫ్, జేడెన్ సీల్స్.

గణాంకాల్లో భారత్‌దే ఆధిపత్యం

వెస్టిండీస్ 2006లో భారత్‌పై చివరిసారిగా ద్వైపాక్షిక వన్డే సిరీస్ గెలిచింది. ఆ తర్వాత జరిగిన 13 సిరీస్‌ల్లోనూ భారత్ విజయం సాధించింది. వెస్టిండీస్‌పై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ ఉన్నాడు. ఆ జట్టుపై అతని ఖాతాలో తొమ్మిది శతకాలు ఉన్నాయి. ఆసియా గడ్డపై 1000కు పైగా పరుగులు చేసిన విదేశీ బ్యాటర్లలో షై హోప్ 68.17 సగటుతో ముందున్నాడు.

తిరువనంతపురం గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో భారత్, వెస్టిండీస్ మధ్య 2018లో తొలి వన్డే జరిగింది. 2023లో జరిగిన మరో మ్యాచ్‌లో కోహ్లీ 166, శుభ్‌మన్ గిల్ 116 పరుగులతో చెలరేగడంతో భారత్ 317 పరుగుల భారీ విజయం సాధించింది. ఈసారి కూడా ఆ మైదానంలో భారత్‌దే పైచేయిగా నిలుస్తుందా, లేక వెస్టిండీస్ చరిత్రను మార్చే ప్రదర్శన చేస్తుందా అనేది ఆసక్తికరం.



వ్యక్తుల కంటే ఆటే గొప్పది'..

వీరేంద్ర సెహ్వాగ్

బలగం టీవీ, హైదరాబాద్

భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టీ20లు, టెస్టుల నుండి తప్పుకోవడంతో మ్యాచ్‌లపై అభిమానుల్లో ఆసక్తి తగ్గుతుందనే ప్రచారాన్ని భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ఘాటుగా కొట్టిపారేసారు. వ్యక్తుల కంటే క్రికెట్ ఎప్పుడూ గొప్పదని, ఆటగాళ్ల రిటైర్మెంట్‌పై ఆట భవిష్యత్తు ఆధారపడి ఉండదని ఆయన స్పష్టం చేశారు.

దిగ్గజ ఆటగాళ్లు తప్పుకున్నంత మాత్రాన ఆటపై ఆసక్తి తగ్గదని, టీవీల నుండి మొబైల్ ఫోన్ల వరకు క్రికెట్ సులువుగా అందుబాటులోకి వచ్చాక వీక్షకుల సంఖ్య మరింత పెరిగిందని సెహ్వాగ్ వివరించారు. గతంలో సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, సచిన్ టెండూల్కర్ వంటి మహా దిగ్గజాలు నాడు రిటైర్ అయినప్పుడు కూడా ఇలాంటి వ్యాఖ్యలే వినిపించాయని, కానీ క్రికెట్ ఆదరణ ఏమాత్రం తగ్గలేదని ఆయన గుర్తుచేశారు.

ఆటగాళ్లతోనే వ్యవస్థ నడిచి ఉంటే అది ఎప్పుడో మునిగిపోయేదని, కొంతమంది అభిమానులు ఇకపై మ్యాచ్‌లు చూడమని చెప్పినా అది పూర్తిగా నిజం కాదని, ఏదో రకంగా ఫాలో అవుతూనే ఉంటారని సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. పాత తరం తప్పుకున్నప్పుడల్లా కొత్త తరం ఆటగాళ్లు వచ్చి ఆ స్థానాన్ని భర్తీ చేస్తారని, ఆట మాత్రమే ఎప్పటికీ స్థిరంగా ముందుడుగు వేస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఆర్చరీలో భారత్ శుభారంభం

ధీరజ్, చికితా అగ్రస్థానాలు.. బ్యాడ్మింటన్‌లో ఉన్నతి, ట్రీజా–గాయత్రి జోడీ క్వార్టర్స్‌కు

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడల ఆర్చరీ పోటీల్లో భారత్ శుభారంభం చేసింది. ధీరజ్ బొమ్మదేవర పురుషుల రికర్వ్ వ్యక్తిగత క్వాలిఫికేషన్‌లో, చికితా తణిపర్తి మహిళల కాంపౌండ్ వ్యక్తిగత క్వాలిఫికేషన్‌లో అగ్రస్థానంలో నిలిచారు. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్‌లోనూ భారత్ తొలి స్థానాన్ని దక్కించుకుంది.

ప్రపంచకప్ ఫైనల్లో చారిత్రక విజయం సాధించిన ఉత్సాహంతో బరిలోకి దిగిన ధీరజ్ 698 పాయింట్లు సాధించాడు. దీంతో ఆసియా క్రీడల క్వాలిఫికేషన్‌లో కొత్త రికార్డు నమోదైంది. పురుషుల రికర్వ్ టీమ్, రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ సీడింగ్స్‌లో భారత్‌కు రెండో స్థానం లభించింది. మహిళల కాంపౌండ్ క్వాలిఫికేషన్‌లో చికితా 705 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మహిళల కాంపౌండ్ టీమ్‌లో భారత్ రెండో స్థానంలో నిలవగా, పురుషుల కాంపౌండ్ టీమ్ మూడో స్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో సాహిల్ జాదవ్ ఐదో స్థానంలో నిలిచాడు.

బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా వరుసగా రెండు విజయాలతో క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. మూడో రౌండ్‌లో మలేషియాకు చెందిన లింగ్ చింగ్ వాంగ్‌ను 21–14, 20–22, 21–19తో ఓడించింది. అనంతరం ప్రపంచ ఆరో ర్యాంకర్ ఇండోనేషియాకు చెందిన పుత్రి కుసుమ వార్దానిపై 21–19, 21–13తో సంచలన విజయం సాధించింది. క్వార్టర్‌ఫైనల్లో జపాన్ స్టార్ అకానె యమగుచితో తలపడనుంది.మహిళల డబుల్స్‌లో ట్రీజా జాలీ–గాయత్రి గోపీచంద్ జోడీ వరుసగా రెండోసారి ప్రపంచ మూడో ర్యాంక్ జపాన్ జోడీ మాయు మత్సుమోటో–యుకి ఫుకుషిమాపై విజయం సాధించింది. 24–22, 21–18తో గెలిచి క్వార్టర్‌ఫైనల్లోకి చేరింది. అయితే పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి ఓటములతో నిష్క్రమించారు.

టేబుల్ టెన్నిస్‌లో మను షా, యశస్విని ఘోర్పడే తమ తమ సింగిల్స్ ప్రీ–క్వార్టర్‌ఫైనల్లో ఓడిపోయారు. దీంతో ఆసియా క్రీడల్లో భారత టేబుల్ టెన్నిస్ ప్రస్థానం ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మను షా–దియా చితాలే జోడీ సాధించిన కాంస్యమే భారత్‌కు ఈ క్రీడాంశంలో దక్కిన ఏకైక పతకం. ఈ క్రీడాంశాలతో పాటు ఈ–స్పోర్ట్స్, ఫెన్సింగ్, కానోయింగ్‌లోనూ భారత్ పెద్దగా పురోగతి సాధించలేకపోయింది.

షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్‌కు రజత పతకం!

20.64 మీటర్ల త్రోతో రెండో స్థానంలో నిలిచిన భారత అథ్లెట్; ఆసియాడ్‌లో తూర్‌కు ఇది వరుసగా మూడో పతకం

బలగం టీవీ, హైదరాబాద్



జపాన్ వేదికగా జరుగుతున్న 20వ ఆసియా క్రీడలలో భారత స్టార్ అథ్లెట్ తజిందర్‌పాల్ సింగ్ తూర్ అద్భుత ప్రదర్శనతో రజత పతకాన్ని (సిల్వర్ మెడల్) కైవసం చేసుకున్నాడు. శనివారం జరిగిన పురుషుల షాట్‌పుట్ ఫైనల్ పోరులో ఐరన్ బాల్‌ను 20.64 మీటర్ల దూరం విసిరి తూర్ రెండో స్థానంలో నిలిచాడు. ఆసియా క్రీడల చరిత్రలో తజిందర్‌పాల్ సింగ్ తూర్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. గత రెండు ఆసియాడ్ ఎడిషన్లలో (2018, 2023) ఆయన పసిడి పతకాలను ముద్దాడిన సంగతి తెలిసిందే.

ఈ విభాగంలో ఇరాన్‌కు చెందిన మొహమ్మద్రెజా తయేబిసే 20.81 మీటర్ల దూరం త్రో చేసి నయా ఆసియాడ్ రికార్డుతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 2018లో తూర్ పేరిట ఉన్న 20.75 మీటర్ల గేమ్స్ రికార్డును తయేబిసే సవరించాడు. ఇక సౌదీ అరేబియాకు చెందిన మహమ్మద్ తోలు 20.48 మీటర్ల ప్రదర్శనతో కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

మూడు రోజుల్లో రూ.136 కోట్లు.. నాని 'ది ప్యారడైజ్' మరో రికార్డు!

నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. విడుదలైన మొదటి రోజు నుంచే భారీ వసూళ్లను రాబడుతున్న ఈ చిత్రం.. తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. ఇప్పటికే నాని కెరీర్‌లో వేగంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటిన సినిమాగా నిలిచిన 'ది ప్యారడైజ్'.. మూడు రోజుల్లోనే రూ.136 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమా మూడు రోజుల బాక్సాఫీస్ వసూళ్లకు సంబంధించిన వివరాలను మేకర్స్ తాజాగా పోస్టర్ ద్వారా వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా మూడు రోజుల్లో ఈ చిత్రం రూ.136 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ప్రకటించారు. మూడో రోజు సుమారు రూ.22 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు ఈ లెక్కల ద్వారా తెలుస్తోంది.రెండో రోజుతో పోలిస్తే మూడో రోజు వసూళ్లలో కొంత తగ్గుదల కనిపించినప్పటికీ.. అది పెద్దగా ప్రభావం చూపలేదని ట్రేడ్ వర్గాల అంచనా. ముఖ్యంగా వారాంతపు రోజుల్లో సినిమాకు వస్తున్న స్పందనతో వసూళ్లు స్థిరంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆదివారం కూడా మూడో రోజు స్థాయిలోనే వసూళ్లు నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. అదే జరిగితే సినిమా త్వరలోనే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌కు చేరువయ్యే అవకాశముంది. మరోవైపు నాలుగో రోజు గంటల వారీగా నమోదవుతున్న బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు సమాచారం. దీంతో ఇప్పుడు అందరి దృష్టి సోమవారం నుంచి మొదలయ్యే ఎంత వసూళ్లు రాబడుతుంది అనే దానిపై ఉంది. వారాంతపు జోరును కొనసాగిస్తూ సినిమా స్థిరమైన వసూళ్లను సాధిస్తుందా? లేక వసూళ్లలో గణనీయమైన డ్రాప్ కనిపిస్తుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.'ది ప్యారడైజ్' చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. నాని సరసన కాయదు లోహర్ నటించగా.. మంచు మోహన్ బాబు, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. తెలంగాణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో యాక్షన్‌తో పాటు సామాజిక అంశాలను కూడా దర్శకుడు కథలో భాగంగా చూపించినట్లు తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమా.. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కొనసాగుతున్న వసూళ్లతో నాని కెరీర్‌లో మరో ముఖ్యమైన చిత్రంగా నిలుస్తోంది.



కనుమరుగైన నిజాలను బహిర్గతం చేస్తూ..



అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం విజయ దశమి కానుకగా అక్టోబర్ 16న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు. "రణబాలి' నెవర్ ఫర్ గెట్ ట్రూత్' పేరుతో 4 ఎపిసోడ్స్ గల డాక్యుమెంటరీ సిరీస్‌ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్టు వారు ప్రకటించారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ నెల 28న తొలి ఎపిసోడ్ 'ది ఫెమైన్ వి ఫర్ గాట్' స్ట్రీమింగ్ కానున్నది. ఈ నెల 30న రెండో ఎపిసోడ్ 'ది హిస్టరీ వి ఫర్ గాట్', అక్టోబర్ 2న మూడో ఎపిసోడ్ 'ది మెన్ వి ఫర్ గాట్' స్ట్రీమింగ్ కానున్నాయి. ఇక నాలుగో ఎపిసోడ్ 'ది లాస్ట్ లోడ్' స్ట్రీమింగ్ డేట్‌ని త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. చరిత్రకు రెండు పార్శ్వాలుంటాయి. ఒకటి మనకు చెప్పింది. మరొకటి ఎవరికీ తెలియకుండా సమాధి చేయబడింది. అలా చరిత్రలో కనుమరుగైన నిజాలను ఈ నాలుగు ఎపిసోడ్స్ బహిర్గతం చేయనున్నాయని మేకర్స్ తెలిపారు. 'రణబాలి' ప్రపంచం నుంచి ఎక్స్‌క్లూజివ్ బిహైండ్ ది సీన్స్ కంటెంట్‌తో ఈ డాక్యుమెంటరీ సిరీస్ రాబోతున్నది.

ప్రేమతో కూడిన హృదయం



తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతి ప్రధానపాత్రలో టాలీవుడ్ ఫిల్మ్ మేకర్ పూరీ జగన్నాథ్ తెరకెక్కించిన పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'స్లమ్ డాగ్ : 33 టెంపుల్ రోడ్'. త్వరలో సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సినిమా ప్రచారాన్ని మేకర్స్ వేగవంతం చేశారు. తాజాగా ఇందులో కీలకపాత్ర పోషిస్తున్న జరీనా వహాబ్ ఫస్ట్‌లుక్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. ప్రేమతో కూడిన హృదయం.. పోరాటాలతో నిండిన జీవితం' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో పొందు పరచిన క్యాప్షన్ జరీనా వహాబ్ పాత్రపై, ఈ సినిమా కథపై ఆసక్తిని పెంచింది. ఇందులో ఆమె జుబైదాగా కనిపించనున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా, దునియా విజయ్ విలన్‌గా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రానికి కెమెరా: సామ్ కె.నాయుడు, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, నిర్మాతలు: పూరీ జగన్నాథ్, చార్మీకౌర్, జె.బి.నారాయణ్‌రావు కొండ్రోళ్ల, నిర్మాణం: పూరీ కనెక్ట్స్.

'ఆదర్శకుటుంబం' వేరే లెవెల్

దాదాపుగా 20ఏళ్ల తర్వాత త్రివిక్రమ్‌తో కలిసి పనిచేశాను. తను రచన చేసిన నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలు క్లాసిక్ లవ్‌స్టోరీలుగా నిలిచాయి. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత నాకోసం అద్భుతమైన కథను తెచ్చారు త్రివిక్రమ్. ఇందులో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. ఊహించని ట్విస్టులుంటాయి. ట్రీట్‌మెంట్ కొత్తగా ఉంటుంది. 'ఆదర్శకుటుంబ' మామూలు కుటుంబం కాదు. ఇది వేరే లెవెల్. త్రివిక్రమ్ అద్భుతంగా హ్యాండిల్ చేశారు. మీరు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు' అని అగ్ర కథానాయకుడు వెంకటేశ్ నమ్మకం వెలిబుచ్చారు.ఆయన హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఆదర్శకుటుంబం: హౌస్ నెం 47 --ూఖ 47'. శ్రీనిధిశెట్టి కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా ఈసినిమాలోని తొలి పాట 'నారాయణమ్మ..'ను మేకర్స్ విడుదల చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ 'వెంకటేశ్‌గారి 'పవిత్రబంధం' సినిమాతో నా సినీప్రయాణం మొదలైంది.'నువ్వునాకు నచ్చావ్'తో మా బంధం బలపడింది. అందుకే ఆయనకు నేనెప్పుడూ కృతజ్ఞుడినై ఉంటా. ఈ పాట రామజోగయ్య అద్భుతం గా రాస్తే, అంతే అద్భుతంగా తమన్ స్వరపరిచారు. వెంకటేశ్‌గారితోపాటు శ్రీనిధిశెట్టి, డింపుల్ హయాతి, నివేద పేతురాజ్ పాటకు అందాన్ని తెచ్చారు. సినిమా కలర్‌ఫుల్‌గా ఉంటుంది' అని తెలిపారు. ఇంకా తమన్, శ్రీనిధిశెట్టి, డింపుల్ హయాతి, నివేదా పేతురాజ్, రామజోగయ్యశాస్త్రి కూడా మాట్లాడారు.



శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ విధ్వంసకర సెంచరీలు



భారత్ ఘన విజయం..

• భారత్ ఘన విజయం

తిరువనంతపురంలోని గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో భారత పురుషుల క్రికెట్ జట్టు వెస్టిండీస్‌పై 8 వికెట్ల తేడాతో తిరుగులేని విజయాన్ని అందు కుంది. 296 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండి యా కేవలం 41.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 300 పరు గులు చేసి ఘన విజయం సాధించింది. 2027 వన్డే ప్రపంచ కప్ సన్నా హకాల్లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించారు. ఈ అద్భుత విజయంతో 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

నిలకడగా ఆడి కుప్పకూలిన వెస్టిండీస్ బ్యాటింగ్

టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న టీమిండియాకు విండీస్ ఓపెనర్లు గట్టి సవాల్ విసిరారు. ఓపెనర్ జస్టిన్ గ్రీవ్స్ (101 పరు గులు) క్లాస్ సెంచరీతో మెరవగా, జాన్ కాంప్‌బెల్ (62) హాఫ్ సెంచరీతో రాణించాడు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్‌కు 135 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఒక దశలో భారీ స్కోరు చేసేలా కనిపించిన విండీస్‌ను చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తన స్పిన్ మాయాజాలంతో దెబ్బతీశాడు. కుల్దీప్ కేవలం 40 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. ఆఖర్లో అమీర్ జం గూ (58) వేగంగా ఆడటంతో వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లనష్టానికి295 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది.

గిల్, కోహ్లీ సెంచరీల సునామీ.. రికార్డుల వేట

రోహిత్ దూకుడు: లక్ష్యఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ 35 బంతుల్లో 3 సిక్సర్లు, 2 ఫోర్లతో 32 పరుగులు చేసి వేగవంతమైన ఆరం భాన్ని ఇచ్చాడు. పంజాబ్ యువ స్టార్ నమన్ ధీర్ ఈ మ్యాచ్‌తో వన్డేల్లోకి అరంగేట్రం చేశాడు. గిల్, కోహ్లీ పార్ట్‌నర్‌షిప్: రోహిత్ అవుట్ అయిన తర్వాత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (110 పరుగులు) మరియు రన్ మెషీన్ విరాట్ కోహ్లీ (139 పరుగులు) విండీస్ బౌలర్లపై నిర్దయాత్మకంగా విరుచుకుపడ్డారు. గిల్ క్లాస్ ఇన్నింగ్స్‌తో సెంచరీ సాధించగా, కోహ్లీ కేవలం 88 బంతుల్లోనే 9 సిక్సర్లు, 10 ఫోర్లతో విధ్వంసకర నాటౌట్ సెంచరీతో చెలరేగిపో యాడు.తెలుగు రాష్ట్రాల అభిమానుల జోష్: ఆదివారం సెలవు రోజు కావడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని క్రికెట్ ప్రేమికులు టీవీలకు అతుక్కుపోయి ఈ మ్యాచ్‌ను వీక్షించారు. కోహ్లీ, గిల్ సిక్సర్లు కొడుతుంటే సోషల్ మీడియాలో తెలుగు ఫ్యాన్స్ రికార్డు స్థాయి మీమ్స్, పోస్టులతో హల్చల్ చేశారు. అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసిన కుల్దీప్ యాదవ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.భారత వన్డే క్రికెట్ చరిత్రలో ఈ రన్ చేజ్ అత్యంత వేగవంతమైన మరియు అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటిగా నిలిచిపోనుంది.



విండీస్‌పై 8 వికెట్ల తేడాతో గెలుపు

వెస్టిండీస్ బౌలర్లకు ఏదశ లోనూ భారత బ్యాటర్లను నిలువరించడం సాధ్యం కాలే దు. గిల్ శతకం సాధించగా, కోహ్లీ కూడా సెంచరీతో ఆకట్టుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిం డియా 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది.

ఆసియా గేమ్స్‌లో భారత్ జోరు..

ఓపెనర్ జస్టిన్ గ్రీవ్స్ 101 పరుగులతో శతకం సాధించగా, జాన్ క్యాంప్‌బెల్ 62 పరుగులు చేశాడు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ నాలుగు వికెట్లు పడగొట్టి విండీస్ భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నాడు.

భారీ లక్ష్యంతో బరిలోకి..

296 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ అద్భు తమైన భాగస్వామ్యంతో విజ యాన్ని సులభతరం చేశారు. ఇద్దరూ శతకాలతో చెలరేగడంతో వెస్టిండీస్ బౌలర్లకు ఏ దశలోనూ భారత బ్యాటర్లను నిలువరిం చడం సాధ్యం కాలేదు. గిల్ శతకం సాధించగా, కోహ్లీ కూడా సెంచరీతో ఆకట్టుకున్నాడు.కోహ్లీ తన ఇన్నింగ్స్‌లో కీలక మైలురాయిని కూడా అందుకున్నాడు. వన్డే క్రికెట్‌లో 15,000 పరుగుల మార్కును దాటిన కోహ్లీ.. ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో చేరాడు. గిల్‌తో కలిసి భారీ భాగస్వామ్యం నెలకొల్పి భారత్‌ను విజయానికి చేరువ చేశాడు.

విండీస్ బౌలర్ల విఫలం

వెస్టిండీస్ తరఫున రోస్టన్ చేజ్, అల్జారి జోసెఫ్ చెరో వికెట్ తీశారు. అయితే భారత బ్యాటింగ్ జోడీ దూకుడును అడ్డుకోవడంలో విండీస్ బౌలర్లు విఫలమయ్యారు. మరోవైపు కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో రాణించి 4/40తో సత్తా చాటాడు.ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ శు భారంభం చేసింది. భారత్--వెస్టిండీస్ వన్డే సిరీస్ సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభమైందని ఐసీసీ కూడా ధృవీకరించింది.